మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 102 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad

ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ

విచారణ 15కు వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్, (ప్రజా మంటలు):
పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ పై గురువారం తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేం దర్, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి , భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులపై అనర్హత వేటు వేయాలని బీఆర్ ఎస్ నేతలు పిటిషన్ వేశారు. మిగతా 2లో..

ఆదాయ లక్ష్యాలను చేరుకోవాల్సిందే

గత ఆర్థిక సంవత్సరాన్ని మించి రాబడులు రాబట్టాలి

రాబడి కోసం ప్రతి విభాగం కఠినంగా ఉండాల్సిందే

ప్రధాన శాఖలన్నీ ఆదాయం వసూళ్లలో ముందుండాలి

ఆదాయం తెచ్చే శాఖలపై సిఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్, (ప్రజా మంటలు):
రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెట్టే విభాగాలన్నీ నిర్ణీత వార్షిక లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం పెరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పన్నుల ఎగవేత లేకుండా అన్ని విభాగాలు కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ప్రతి విభాగం నెలవారీగా లక్ష్యాలను తయారు చేసుకోవాలని, ఎప్పటికప్పుడు సాధించిన పురోగతిని బేరీజు వేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆదాయం తెచ్చి పెట్టే వనరులపై, పన్నుల వసూళ్లపైన అధికారులు నిక్కచ్చిగా ఉండాలని ఆదేశించారు. సంబంధిత విభాగాన్ని అవసరమైతే పునర్ వ్యవస్థీకరించుకోవాలని, ఆదాయం రాబట్టేందుకు వీలైనన్ని సంస్కరణలు చేపట్టాలని దిశా నిర్దేశర చేశారు. ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, రవాణా విభాగాల అధికారులతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు సచివాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సచివాలయంలో దాదాపు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా ఈ సమావేశంలో వివిధ అంశాలను చర్చించారు. ఎంచుకున్న వార్షిక లక్ష్యంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకు వచ్చిన ఆదాయం అంత ఆశాజనకంగా లేదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఓటాన్ అకౌంట్ బ్జడెట్లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏ నెలకా నెలా మంత్లీ టా÷-గ్ట÷ట్ ను నిర్దేశిరచుకొని రాబడి సాధించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రతి నెలా మొదటి వారంలో నిర్ణీత ఆదాయ లక్ష్యాలపై తాను సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. నెలవారీ సమీక్షతో పాటు ప్రతి శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సంబంధిత శాఖల లక్ష్య సాధన పురోగతిపై సమావేశ మవుతారని చెప్పారు. ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే మిగతా 2లో..

హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేసిన ఘనత కిషన్ రెడ్డిదే

కేంద్రమంత్రిగా ఒక్క పనీ చేయలేక పోయారు

మండిపడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, (ప్రజా మంటలు):
పార్లమెంట్ సభ్యుడిగా.. కేంద్రమంత్రిగా ఉండి హైదరాబాద్ అభివృద్ధికి కిషన్‌రెడ్డి ఏం చేశారో చెప్పాలని తెలంగాణ మంత్రి పొన్న ప్రభాకర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేసినట్లుగా, అభివృద్ధి కుంటుపడినట్లుగా కిషన్‌రెడ్డి మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. గాంధీభవన్‌లో మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. కేంద్రం హైదరాబాద్‌ను స్మార్ట్ సిటీ చేయలేదని, అమృత్ పథకం నుంచి ఒక్క రూపాయి ఇవ్వలేదని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతోనే రాజకీయ లబ్ది కోసం హైదరాబాద్‌ను విమర్శిస్తున్నారని ఆక్షేపించారు.'హైదరాబాద్.. చారిత్రక నగరం మిగతా 2లో..

నీట్ పేపర్ లీకేజీలో మరొకరు అరెస్ట్

రంజన్ అనే నిందితుడిని పట్టుకున్న సిబిఐ

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
నీట్ ప్రవేశ పరీక్ష లీక్ కేసులో రాకీ అలియాస్ రాకేష్ రంజన్ అనే మరో నిందితుడిని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ సిబిఐ అదుపులోకి తీసుకుంది. బిహార్‌లోని నవాడ అతని స్వగ్రామం. రాకీ కొన్ని సంవత్సరాలుగా రాంచీలో ఓ రెస్టారెంట్ నడుపుతున్నాడు. అతను నీట్ పేపర్ లీక్ అయిన తర్వాత అందులోని ప్రశ్నలకు సమాధానాలు రాసి చింటూ మొబైల్‌కు పంపాడు. రాకీని పట్టుకునేందుకు పట్నా, కోల్‌కతా సమీపంలోని పలు ప్రాంతాల్లో సీబీఐ దాడులు నిర్వహించింది. అతని భార్య ఇమెయిల్ ఎఆ ఐపీ అడ్రస్ ద్వారా రాకీని పట్టుకోగలిగారు.అరెస్టు అనంతరం కోర్టులో రాకీని హాజరు పరిచారు. తదుపరి విచారణ కోసం సీబీఐ అతనికి10 రోజుల రిమాండ్‌ను మంజూరు చేసింది. అతను ఇప్పటికే కొన్ని పోటీ పరీక్షల పేపర్ల లీకేజీకి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. బిహార్ రాష్ట్రం మలందాకు చెందిన మాస్టర్ మైండ్ సంజీవ్ ముఖియాతో ఇతనికి మిగతా 2లో..

ఫోన్ ట్యాపింగ్ కేసుతో సంబంధం లేదు

ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు లేఖ - ఆలస్యంగా వెలుగు చూసిన వైనం

హైదరాబాద్, (ప్రజామంటలు): ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు రాసిన లేఖ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జూన్ 23న ఆయన జూబ్లీహిల్స్ పోలీసులకు లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుతో తనకు సంబంధం లేదని అందులో పేర్కొన్నారు. జూన్ 26న తాను భారత్‌కు రావాల్సిందని.. ఆరోగ్యం బాగోలేక అమెరికాలో ఉండిపోవాల్సి వచ్చిందని వివరించారు. క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లు చెప్పారు. అమెరికా వైద్యుల సూచనతో అక్కడే చికిత్స పొందుతున్నట్లు ప్రభాకర్ రావు తెలిపారు.నాకు గతంలో ఉన్న మలిగ్నెంట్ క్యాన్సర్‌తో పాటు ఇప్పుడు బీపీ పెరిగింది. నాపై అసత్య ఆరోపణలు చేస్తూ మీడియాకు లీకులు ఇస్తున్నారు. నేను, నా కుటుంబం మానసికంగా ఇబ్బందులు పడుతున్నాం. ఓ పోలీసు అధికారిగా ఎలాంటి తప్పు చేయలేదు. చట్టపరంగా విచారణ జరిపించాలని కోరుతున్నాను. దర్యాప్తులో పోలీసులకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నా. టెలీకాన్ఫరెన్స్‌లో, మెయిల్ ద్వారా సమాచారం ఇవ్వడానికైనా సిద్ధం. క్రమశిక్షణ గల అధికారిని.. విచారణ ఎదుర్కొంటా. ఎక్కడికీ తప్పించుకుని పారిపోయే పరిస్థితి లేదు. పూర్తిగా కోలుకున్నాక మీ ముందు హాజరై అన్ని ప్రశ్నలకు సమాధానం ఇస్తాను. నా దృష్టికి వచ్చిన సమాచారాన్ని విచారణాధికారికి చెబుతాను' అని ప్రభాకర్‌రావు లేఖలో పేర్కొన్నారు.

బతుకమ్మ బకాయిలు చెల్లించలేని అసమర్థులు

కెటిఆర్ లేఖపై మండిపడ్డ బండి సంజయ్

హైదరాబాద్, (ప్రజా మంటలు):
బతుకమ్మ బకాయిలు చెల్లించలేని అసమర్థులు అంటూ కెటిఆర్ లేఖపై బండి సంజయ్ మండిపడ్డారు. కేంద్రం నుంచి సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్ తీసుకురావాలని భారాస నేత కేటీఆర్ రాసిన లేఖపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. నేతన్నలు ఇన్నాళ్లకు గుర్తొచ్చారా..? పదేళ్లుగా రాష్ట్రాన్ని పాలించింది మీరే కదా? అని ఎద్దేవా చేశారు. 'సిరిసిల్లకు 15 ఏళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు కదా? మీ హయాం నుంచే నేతన్నల ఆకలి చావులు కొనసాగుతున్నాయి. మీరెందుకు వారిని సంక్షోభం నుంచిగట్టెక్కించలేకపోయారు? 'బతుకమ్మ' బకాయిలు కూడా చెల్లించకుండా పవర్ లూమ్ సంస్థలు మూతపడేలా చేసింది మీరు కదా అని ప్రశ్నించారు. ప్రధాని తెలంగాణకు మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను ప్రకటించినప్పుడు మీకు సిరిసిల్ల గుర్తురాలేదా? సిరిసిల్ల నేతన్నలను సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తా. కరీంనగర్ ఎంపీగా అది నా బాధ్యత అని బండి సంజయ్ తెలిపారు.

ఇక రైతుబంధు రికవరీలు

ప్లాట్లు చేసిన భూమికి చెల్లింపులపై నోటీసులు

హైదరాబాద్, (ప్రజా మంటలు):
అర్హులకు రైతుభరోసా ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం, అప్పనంగా రైతుబంధు పొందిన వారి నుంచి రికవరీలకు రంగం సిద్ధం చేస్తోంది. వ్యవసాయేతర భూములకు ఇచ్చిన రైతుబంధుపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వ్యవసాయేతర భూములకు రైతుబంధు డబ్బులు తీసుకున్న లబ్దిదారులు తిరిగి ఇవ్వాలని నోటీసులు పంపించనుంది. ఈ మేరకు సొమ్ము రికవరీకి చర్యలు తీసుకోనుంది. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం పోచారం రైతు యాదగిరిరెడ్డికి వెంచర్లపై ఇచ్చిన రైతు బంధు సొమ్ము రికవరీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో 33 ఎకరాల భూమిని యాదగిరిరెడ్డి ప్లాట్లుగా వేసి విక్రయించారు. 33 ఎకరాల ప్లాట్లపై రూ.16లక్షల వరకు రైతు బంధు డబ్బులు తీసుకున్నారు. ఆ మొత్తం తిరిగి చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు.

ప్రజా నాడి



మెడ్‌టెక్ జోన్ గ్లోబల్ జోన్‌గా ఎదుగడం ఖాయం

విశాఖ హార్ట్ టచింగ్ సిటీ అన్న చంద్రబాబు

జోన్ ప్రతినిధులతో సిఎం చంద్రబాబు సమావేశం

విశాఖపట్నం,జూలై11 (ప్రజా మంటలు):
మెడ్‌టెక్ జోన్ గ్లోబల్ జోన్‌గా ఎదుగుతుందని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. మెడ్ టెక్ జోన్ ప్రతినిధులతో గురువారం సమావేశం అయ్యారు. స్టీల్ సిటీ, మెడికల్ సిటీ, భోగపురం విమానాశ్రయం అభివృద్ధి చేస్తానని సీఎం చంద్రబాబు అన్నారు. తన హార్ట్ టచింగ్ సిటీ ఇదని హుద్ హుద్ సమయంలో వారం రోజులు ఇక్కడే ఉన్నానని తెలిపారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో కూటమిని భారీ మెజారిటీతో గెలిపించారని చెప్పారు. ఇక్కడ మూడు పార్టీల నాయకులు ఉన్నారని స్వర్ణయుగంలో అభివృద్ధి తథ్యమని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. ఒక చిన్న ప్రయత్నం.. ఒక చరిత్రగా అవతరించింది. మెడి టెక్ సీఈఓ జితేందర్ శర్మను నా ప్రభుత్వంలో సలహాదారుగా బాధ్యత తీసుకోమని అడిగా. 28 కొత్త విధానాలు ప్రవేశపెట్టారు. పబ్లిక్ హెల్త్‌లో మెడికల్ ఎక్విప్‌మెంట్ బాధ్యతతో కూడుకున్నది. ఆ బాధ్యతలను శర్మ సమర్థంగా నిర్వర్తించారు. ప్రభుత్వం సపోర్ట్ లేకుండా సంక్షోభాలను తట్టుకుంటూ మెడ్‌టెక్‌ను అభివృద్ధి చేశారు. 1999లో బయో టెక్నాలజీ పార్క, దాని కంటే ముందు ఐటీ ఉండేది. భారత్ బయోటెక్ ద్వారా ప్రపంచ దేశాలకు కోవిడ్ వ్యాక్సిన్ తయారు చేశారు. కోవిడ్ సమయంలో ప్రభుత్వానికి అవసరమైన వ్యాక్సిన్లను అందజేశారు. వ్యాక్సిన్ అందించి ప్రపంచాన్ని కాపాడారు. శర్మ 140 కంపెనీలు ఏర్పాటు చేశారు . మార్కెటింగ్, మ్యానిఫ్యాక్చరింగ్, మిగిలినవి అన్నీ ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. 10 వేల కోట్లు టర్నోవర్ 6 వేల ఉద్యోగులతో మెడికల్ హబ్‌గా మారింది. మంచి ఉత్పత్తులు అందిస్తున్నారు. దేశంలో 20 రాష్ట్రాల్లో ఈ ఉత్పత్తులు వినియోగంలో ఉన్నాయి.. కానీ ఏపీలో మాత్రం గత ప్రభుత్వం వినియోగించుకోలేదు. ట్రిపుల్ ఐటీ చాలా కాలం క్రితం ప్రారంభించా.. ఇప్పుడు మంచి ఫలితాలు అందిస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దిశగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలి. 275 ఎకరాల విస్తీర్ణంలో మెడ్ టెక్‌ను అభివృద్ధి చేశారని చంద్రబాబు పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

ఆదాయ లక్ష్యాలను చేరుకోవాల్సిందే

జీఎస్టీ ఆదాయం పెంచుకునే చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. జీఎస్టీ రాబడి పెంచేందుకు వాణిజ్య పన్నుల శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, పక్కాగా ఆడిటింగ్ చేయాలని సీఎం ఆదేశించారు. జీఎస్టీ చెల్లింపుల విషయంలో ఎవరినీ ఉపేక్షించకుండా, నిక్కచ్చిగా పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. పెట్రోలు, డీజిల్ పై వాట్ ద్వారా వచ్చే ఆదాయం తగ్గిందని, ప్రత్యామ్నాయంగా ఏవియేషన్ ఇంధనంపై ఉన్న పన్నును సవరించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను సూచించారు. ఎన్నికలప్పుడు మద్యం అమ్మకాలు, విక్రయాలు ఎక్కువగా జరిగినప్పటికీ అంతమేరకు ఆదాయం పెరగకపోవటానికి కారణాలను సీఎం ఆరా తీశారు. అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయాలని, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ను అరికడితే ఆదాయం పెరిగే అవకాశముందని చర్చ జరిగింది. డిస్టిలరీస్ నుంచి మద్యం అడ్డదారి పట్టకుండా నిఘా పెట్టాలని, అందుకు అవసరమైన అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సీఎం ఆదేశించారు. రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్మెంట్ ప్రాజెక్టులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని సమావేశంలో చర్చ జరిగింది. ఈ ఆరు నెలల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో అటు కమర్షియల్ నిర్మాణాలు పెరిగాయని, గృహ నిర్మాణాలు కూడా అదే వరుసలో పుంజుకుంటాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయని, అదే స్థాయిలో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరిగేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇసుక, ఖనిజ వనరుల ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను అరికట్టాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగించేందుకు పరిమిత కాలం పన్ను సబ్సిడీ అమలైందని, తిరిగి పన్ను వసూలు చేయటం ద్వారా వాహనాల అమ్మకాలపై ఏమైనా ప్రభావం పడిందా.. అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ

గురువారం హైకోర్టు విచారణ సందర్భంగా అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి కోర్టుముందు వాదనలు వినిపించారు. వాదోపవాదాలు విన్న హైకోర్టు .. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. పార్టీ ఫిరాయింపులపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ ఎస్ ఎమ్మెల్యే వివేకానంద న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా గెలిచి కాంగ్రెస్ లో చేరారని తెలిపారు.వీరిపై స్పీకర్ కు ఫిర్యాదు చేసినప్పటికీ ఆయన చర్యలు తీసుకోలేదని, కోర్టు స్పందించి ఆ ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకునేలా చేయాలని వివేకానంద పిటిషన్ లో వెల్లడించారు.

హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేసిన ఘనత కిషన్ రెడ్డిదే

ఇస్తాంబుల్ వంటిది. చార్మినార్, గోల్కొండ వంటి ఆర్కియాలజీకి సంబంధించి ఎన్నో ఉన్నాయి. కేంద్ర పర్యాటక మంత్రిగా గత ఐదేళ్లలో కేంద్రం నుంచి హెరిటేజ్, టూరిజం, ఆర్కియాలజీ విభాగాల నుంచి హైదరాబాద్‌కు కిషన్‌రెడ్డి ఏం తెచ్చారు? ఒక్క రూపాయి అయినా తెచ్చారా? మేం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రం నుంచి నిధులు కావాలని అనేక సార్లు విజ్ఞప్తి చేశాం. హైదరాబాద్‌లో 151 ప్రాంతాల్లో వర్షం వచ్చినప్పుడు నీటి నిల్వలతో సమస్యలు ఏర్పడుతున్నాయి. రాజకీయాలకు అతీతంగా ఇంఛార్జి మంత్రిగా ఇక్కడి సమస్యలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నా. వీలైతే హైదరాబాద్ అభివృద్ధికి సహాయం చేయండి. భాజపాపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక నిధులు తీసుకురాలేకపోయిన కేటీఆర్.. ఇప్పుడు హైదరాబాద్ గురించి మాట్లాడుతున్నారు. ఆయన మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. భూకబ్జాలు, అక్రమ కట్టడాలతో హైదరాబాద్ ఇలా కావడానికి కారణం కేటీఆరే. మా ప్రభుత్వం వచ్చి ఆరు నెలలే అయింది. ఈ ఆరు నెలల్లో జీహెచ్ఎంసీ, హైదరాబాద్ కలెక్టరేట్‌లో అనేక సమీక్షలు నిర్వహిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నాం. బోనాల పండగ తర్వాత నేరుగా బస్తీల్లోకి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తాం. ఎన్నికల కోడ్ కారణంగా జాప్యం జరిగితే ఉద్యోగ నియామకాలు ఏమైయ్యాయని అడిగింది ప్రతిపక్షాలే. పక్రియ ప్రారంభమైన తర్వాత అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నదీ వీళ్లే. ఈ పదేళ్లలో టెట్, డీఎస్సీ నిర్వహించనోళ్లు ఇప్పుడు నిరుద్యోగులను ఎందుకు రెచ్చగొడుతున్నారు? నిజమైన సమస్యలు ఏమైనా ఉంటే మా దృష్టికి తీసుకురావాలని విద్యార్థి సంఘాల నాయకులను కోరుతున్నా'అని మంత్రి పొన్నం తెలిపారు.

నీట్ పేపర్ లీకేజీలో మరొకరు అరెస్ట్

రంజన్ అనే నిందితుడిని పట్టుకున్న సిబిఐ

సంబంధాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి ఇటీవలే ఇద్దరు అనుమానితులైన సన్నీ, రంజిత్‌లను సీబీఐ అరెస్టు చేసింది. సన్నీ విద్యార్థి కాగా, రంజిత్ ఓ విద్యార్థి తండ్రి. వీరిని ఆరు రోజుల రిమాండ్‌కు తరలించారు. వారిని విచారిస్తుం డగానే రాకీ గురించి తెలిసింది. హజారీబాగ్‌లోని ఒయాసిస్ స్కూల్ నుంచి పేపర్ లీక్ జరిగిందని విచారణలో తేలింది. సంజీవ్ ముఖియా పరీక్ష పత్రాలను అందుకున్నాడు. వాటిని ఇప్పటికే సీబీఐ కస్టడీలో ఉన్న నిందితుడు చింటూ మొబైల్‌కు ఫార్వార్డ్ చేశాడు. చింటూ, రాకీ.. పట్నాలోని లెర్న్ ప్లే స్కూల్‌లో ప్రశ్నలు, సమాధానాలను విద్యార్థులకు షేర్ చేశారు.

మైనర్ బాలిక హత్య కేసులో కీలక మలుపు

ఆత్మహత్య చేసుకున్న నిందితుడు సురేశ్

అమరావతి,జూలై11(ప్రజా మంటలు):

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన అనకాపల్లి మైనర్ బాలిక హత్య కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుడు సురేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. అందరూ అనుమానించినట్లుగానే నిందితుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. గత నాలుగు రోజులుగా నిందితుడి కోసం పోలీసులు 12 బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే నిందితుడు ఫోన్ వాడకపోవడంతో అతడికి కనుగొనడం పోలీసులకు సవాల్‌గా మారింది. చివరకు రాంబిల్ల మండలం కొప్పుగుండు పాలెంలో నిందితుడు సురేష్ మృతదేహం లభ్యమైంది. కొప్పగొండపాలెం పరిసరాలలో మృతదేహం బోర్లా పడి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. వెంటనే మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా... అనకాపల్లికి చెందిన బాలికను నిందితుడు సురేష్ ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేశాడు. ఆమె నిరాకరించడంతో ఈనెల 5న ఇంట్లో ఉన్న బాలికపై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. ఆపై సురేష్ అక్కడి నుంచి పరారయ్యాడు. గతంలో కూడా బాలికను సురేష్ వేధింపులకు గురిచేయడంతో.. అతడిపై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. తనను అరెస్ట్ చేయించారని కోపంతో రగిలిపోయిన సురేష్.. బెయిల్‌పై విడుదలైన వెంటనే బాలికను దారుణంగా హతమార్చినట్లు తల్లిదండ్రులు వాపోయారు. మరోవైపు ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని పట్టుకోడానికి తీవ్రంగా శ్రమించారు. నిందితుడు విడిచి వెళ్లిన లేఖ ఆధారంగా సురేష్ కూడా ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు భావించారు.

తయారీ రంగానికి ఎంపి అనువైన ప్రాంతం

సీఐఐ నేషనల్ కౌన్సిల్ సమావేశంలో సీఎం చంద్రబాబు

విశాఖపట్నం,జూలై11 (ప్రజా మంటలు):

రాష్ట్రంలో నైపుణ్య గణనపై ప్రధానంగా దృష్టి సారించామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గురువారం విశాఖలో నిర్వహించిన సీఐఐ నేషనల్ కౌన్సిల్ సమావేశంలో సీఎం పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేందుకే స్కిల్ సెన్సస్. గ్లోబల్ ఉద్యోగ అవకాశాలు పొందేలా చూస్తాం. తయారీ రంగానికి ఏపీ వ్యూహాత్మక ప్రాంతం. విశాఖను ఫిన్‌టెక్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. ఆగ్రో ఇండస్ట్రీస్ రంగంలో ఏపీలో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రంలో సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది, మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఫార్మా, ఆటోమొబైల్, హార్డ్‌వేర్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయి' అని సీఎం చంద్రబాబు వివరించారు.

ఎన్నికల కేసులో జయప్రదకు ఊరట

లక్నో,జూలై11 (ప్రజా మంటలు):

ఎన్నికల నియామవళి ఉల్లంఘనకు సంబంధించిన కేసులో మాజీ ఎంపీ, సినీనటి జయప్రదకు ఊరట లభించింది. ఈ కేసులో ఆమెను యూపీ కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆమె ఉత్తర్‌ప్రదేశ్ లోని రామ్‌పుర్ స్థానం నుంచి భాజపా అభ్యర్థిగా పోటీ చేశారు. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఆజం ఖాన్ చేతిలో ఓటమిని చవిచూశారు. అయితే.. ప్రచార సమయంలో ప్రత్యర్థి ఆజం ఖాన్‌పై చేసిన వ్యాఖ్యల క్రమంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ పోలీస్ స్టేషన్‌లో ఆమెపై కేసు నమోదైంది. దీనిపై విచారణ చేపట్టిన ప్రజాప్రతినిధుల న్యాయస్థానం గురువారం ఆమెను నిర్దోషిగా ప్రకటించినట్లు సీనియర్ న్యాయవాది అమర్‌నాథ్ తివారీ వెల్లడించారు. న్యాయమూర్తి తుది తీర్పు వెలువరించిన సమయంలో ఆమె కోర్టులోనే ఉన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. 'రామ్‌పుర్ నుంచి రెండుసార్లు ఎంపీగా ఎన్నికయ్యాను. ఎప్పుడూ ఇక్కడే ఉంటాను. నేనెప్పుడూ తప్పుడు వ్యాఖ్యలు చేయలేదు. సత్యమేవ జయతే' అని పేర్కొన్నారు.

డ్రగ్ పెడ్లర్ నవీన్ గౌడ్ అరెస్ట్

హైదరాబాద్,జూలై11(ప్రజా మంటలు):

డ్రగ్ పెడ్లర్ నవీన్ గౌడ్‌ను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీ బస్‌స్టేషన్ వద్ద హాష్ ఆయిల్, వీడ్ ఆయిల్ విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 825 గ్రాముల హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.4.22లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. నిజామాబాద్‌కు చెందిన నవీన్ గతంలో వివిధ కేసుల్లో జైలు జీవితం అనుభవించాడు. జైల్లో ఉండగా అతడికి ఏపీలోని అరకుకి చెందిన గంజాయి గ్యాంగ్‌తో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి బయటకొచ్చిన తర్వాత ఆ ముఠా నుంచి ఎండు గంజాయి, హాష్ ఆయిల్ కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు అశోక్ నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు జంక్షన్లలో విద్యార్థులకు గంజాయి విక్రయించినట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు.

ప్రణీత్‌కు 14 రోజుల రిమాండ్

హైదరాబాద్,జూలై11(ప్రజా మంటలు):

మంచీచెడుల విచక్షణ మరచి తండ్రి, కూతురు బంధానికి అశ్లీలం జోడించి మాట్లాడిన బూతు యూట్యూబర్ ప్రణీత్ హనుమంతుకు హైదరాబాద్ నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధించింది. ప్రణీత్‌పై 67బీ ఐటీ యాక్ట్, ఫోక్సో యాక్ట్ ,79, 294 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి బెంగళూరులో అరెస్టు చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు గురువారం నాంపల్లి కోర్టులో హాజరు పర్చారు. ప్రణీత్‌కు 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. ఇదే కేసులో ఏ2గా డల్లాస్ నాగేశ్వరరావు, ఏ3గా బుర్రా యువరాజ్, ఏ4గా సాయి ఆదినారాయణను చేర్చారు.

నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం

హైదరాబాద్,జూలై11((ప్రజా మంటలు):

నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి, చిలకలగూడ, ప్యాట్నీ, ప్యారడైజ్, తిరుమలగిరి, ఆల్వాల్, కవాడిగూడ, దోమలగూడ, విద్యానగర్, ముషీరాబాద్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, అడిక్ మెట్, గాంధీనగర్, బేగంపేట్, మారేడ్‌పల్లి, బంజారాహిల్స్, మల్కాజిగిరి, కీసర, చర్లపల్లి, కుషాయిగూడ, ఏఎస్‌రావు నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.రాష్ట్రంలో రాగల మూడు రోజులు కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇదే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. శుక్రవారం, శనివారం కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని హెచ్చరించింది.

లోకేశ్ వాట్సాప్ క్లోజ్

ఇక నుంచి మెయిల్ ద్వారా వినతులు పంపండి

అమరావతి,జూలై11(ప్రజా మంటలు):

ప్రజలు తమ సమస్యలను వాట్సప్ ద్వారా కాకుండా మెయిల్‌కు పంపాలని విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తమ సమస్యలపై వాట్సప్ మెసేజ్‌లు పంపుతుండడంతో మంత్రి వాట్సప్‌ను మాతృసంస్థ మెటా బ్లాక్ చేసింది. వేలాది మంది తమ సమస్యలను వాట్సప్ చెయ్యడం వల్ల సాంకేతిక సమస్యతో బ్లాక్ అయినట్లు నారా లోకేశ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. దీంతో మెయిల్ ఐడీ ద్వారా ప్రజలు తనకు సమాచారం, సమస్యలను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. తానే అందరి సమస్యలు నేరుగా చూస్తానని స్పష్టం చేశారు. పేరు, ఊరు, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ, సమస్య-సహాయానికి సంబంధించిన పూర్తి వివరాలు వినతులలో పొందుపరచాలని సూచించారు. యువగళం పాదయాత్రలో నిర్వహించిన 'హలో లోకేశ్' కార్యక్రమం పేరుతోనే ఈ మెయిల్ ఐడీని లోకేశ్ క్రియేట్ చేసుకున్నారు.

ఎమరాల్డ్ స్వీట్స్‌లో నాణ్యతలేని పదార్థాలు

ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడిలో గుర్తింపు

హైదరాబాద్,జూలై11(ప్రజా మంటలు): ఇందిరా పార్క్ దగ్గర ఉన్న ఎమరాల్డ్ స్వీట్ షాపులో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మిఠాయిలు తయారు చేసే కిచెన్ అపరిశుభ్రంగా ఉందని అధికారులు గుర్తించారు. అంతే కాకుండా స్వీట్స్? తయారీకి ప్రమాదకరమైన బెల్లం.. నాణ్యత లేని జీడిపప్పు వాడుతున్నారు, మెడికల్ సర్టిఫికెట్ లేని ఫుడ్ హ్యాండిలర్స్ ను గుర్తించారు. అంతే కాకుండా స్వీట్స్‌తయారీకి వాడే ముడి పరుకులపై , వాటర్ క్యాన్ పై సరైన లేబుల్ లేదని అధికారులు తెలిపారు. షాపులో నిల్వ ఉన్న ప్రమాదకరమైన 60 కేజీల బెల్లం... నాణ్యత లేని 3 కిలోల జీడిపప్పును స్వాధీనం చేసుకున్నారు.

ప్రజలకు అధికారులు జవాబుదారిగా పని చేయాలి

ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ సూచన

(రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి జులై 11 (ప్రజామంటలు):

ప్రజలను అధికారులు ఎల్లవేళలా జవాబుదారిగా పని చేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. గురువారం ధర్మపురి ఎంపీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తో కలిసి ధర్మపురి నియోజకవర్గ స్థాయి సమావేశంలో పాల్గొన్నారు.

మున్సిపల్, విద్యుత్, త్రాగునీరు, దేవాదాయ శాఖల అధికారులతో సంబంధిత అంశాలపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ధర్మపురి నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న పనులు డ్రైనేజి, త్రాగునీరు సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ అంతరాయాలు తరుచూ కలుగుతున్నాయని, ఇది ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే అంశం అని లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి క్షేత్రానికి త్రాగునీటి శాశ్వత పరిష్కారం కనుగొనాలని సూచించారు. పేదలకు పంచిన అసైన్డ్ భూములను కాపాడి, పేదలకే చెందేలా చూడాలన్నారు. జాతీయ రహదారిపై ఆర్చిగేటు నిర్మాణానికి అనుమతి తీసుకున్నారా అంటూ 6 లైన్ల విస్తరణ నష్టం కలిగించదా అని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ...మున్సిపల్ టాక్సులు పెండింగ్ ఎందుకు ఉన్నాయని, విద్యుత్ వైర్లకు అడ్డువస్తున్నాయని తరుచూ కొమ్మలను కాక, చెట్లను తొలగించడం పద్ధతి కాదని హెచ్చరించారు. మళ్ళీ సమీక్షా సమావేశంలో నేటి అంశాలపై ప్రగతి నివేదికలతో రావాలని ఆదేశించారు. గ్రామంలో, పట్టణం లో పారిశుద్ధ్యం డ్రైనేజీ వ్యవస్థ శానిటేషన్ చేయించి దోమలు వృద్ధి చెందకుండా శుభ్రపరచాలని, ఎప్పటికప్పుడు అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. త్రాగునీరు సరఫరాలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన త్రాగునీరు పంపిణీ చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసుధన్, డీ పీఓ దేవరాజు, తహశీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపిడిఓ, మిషన్ భగీరథ, దేవాదాయ, మున్సిపల్, విద్యుత్ అధికారులు, వివిధ మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానంలో విప్, ఎంపీ పూజలు:

ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానాన్ని పెద్ద పెల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ , ధర్మపురి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించారు. దేవస్థానం సాంప్రదాయ ప్రకారం మేళతాళాలతో స్వాగతం పలికారు. వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. సూపరింటెండెంట్ కిరణ్ శ్రీ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం చిత్రపటం ఇచ్చి సన్మానించారు. దేవస్థానం వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంభి శ్రీనివాసాచార్యులు, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరె కులస్తులను ఆదుకోరా?

మోటె చిరంజీవి, రాష్ట్ర అధ్యక్షులు -ఆరె కుల విద్యావంతుల వేదిక

ఎల్కతుర్తి జులై 11 (ప్రజామంటలు):

ఆరె అంటే ఉర్దూ భాషలో వచ్చినవారు అని అర్థం. అవిభాజ్య హైదరాబాద్ రాజ్యంలో ప్రస్తుతం మహారాష్ట్రలోని మరాట్వాడ ప్రాంతంతో పాటు, కర్ణాటక రాష్ట్రంలోని ఈశాన్య జిల్లాలైన బీదర్, రాయచూర్, బీజాపూర్, యాద్గిర్ వంటి ప్రాంతాలు అంతర్భాగంగా ఉండేవి. అప్పట్లో నిజాం తన పాలనపరమైన అవసరాలకు మరాఠీ సామాజిక వర్గానికి చెందిన వారిని పాటిల్స్ గా, పట్వారిలుగా, పోలీస్ పటేల్స్ గా నియమించుకునేవారు. కాలక్రమేణా వీరు అంతరించిపోవడం జరిగింది.చాలామంది ఆరె కులస్తులను ఆరె పటేల్ అని సంబోధించేవారు.ఆరె కులస్తులు వారి కుటుంబాలను పోషించుకోవడానికి ప్రధానంగా వ్యవసాయం చేసుకునే జీవనం సాగిస్తారు.వీరు మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ,ఆంధ్ర ప్రదేశ్ లలో నివసిస్తున్నారు. ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా, సామాజికపరంగా అన్ని రంగాలలో వెనుకబడి ఉన్న కులాలలో మరింత వెనుకబడిన కులం ఆరె కులం.తెలంగాణ రాష్ట్రంలో ఉన్న దాదాపు పది లక్షలకు పైచిలుకుగా వున్న ఆరె కులస్తులను గత పాలకులు నిర్లక్ష్యం చేశారు.స్వాతంత్రం సిద్ధించి 76 ఏళ్లు కావస్తున్న ఆరె కులస్తులను చట్టసభలలో అనగా శాసనసభ, శాసనమండలి, పార్లమెంటులలో ఇప్పటివరకు అవకాశం రాలేదు. ఆరె కులస్తులను రాజకీయ పార్టీలు కార్యకర్తలు గానే చూస్తున్నారు తప్ప, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించడం లేదు. ఆరె కులస్తులు సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసి వరకు మాత్రమే పరిమితం అవుతున్నారు. ఆ పై స్థాయిలలో పదవులు పొందలేదు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆరె కులస్తులను గుర్తించి రెండు కార్పొరేషన్ చైర్మన్ లు, ఒక కమిషన్ చైర్మన్ మాత్రమే ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 5 లక్షల వరకు ఓటర్లు ఉన్నటువంటి ఆరె కులస్తులను గుర్తించి ప్రస్తుత ప్రభుత్వం ఆరె కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆరె కులస్తులు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆరె కులస్తులు ఉన్నప్పటికీ ఎక్కువగా 23 జిల్లాల్లో ఉన్నారు.ఆయా నియోజక వర్గాలలో పోటీ చేసేటు వంటి శాసనసభ్యుల గెలుపు, ఓటములను శాసించే దిశగా కూడా ఆరె కులస్తులు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఆరె కులస్తులు వ్యవసాయం చేస్తూ వారి యొక్క జీవనాన్ని గడుపుతున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులవృత్తులను ప్రోత్సహిస్తున్నది. చాకలి,మంగలి వారికి ఉచిత విద్యుత్తు,గౌడ కులస్తులకు పింఛన్లు,చెట్టుపై నుండి పడిపోతే ఎక్స్గ్రేషియా, వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నటువంటి రైతులకు రైతు భరోసా,రైతు బీమా మొదలైన అనేక పథకాలను అమలు చేస్తుంది. ఇలా తరతరాలుగా వ్యవసాయంపైనే ఆధారపడుతూ, వ్యవసాయం చేస్తూ, ఇంట్లో పిల్లలను చదువుపించి ప్రయోజకుల్ని చేస్తూన్నారు.ఆరె కులంలోని విద్యార్థులంతా ఇప్పుడిప్పుడే ఉన్నత చదువులు చదువుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరె కులస్తులకు బి సి -డి సర్టిఫికెట్ ఇస్తున్నారు కానీ, కేంద్రంలో ఇంకా ఓబీసీ జాబితాలో చేర్చనందున ఇప్పుడిప్పుడే చదువుతున్నటువంటి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఆరె కులస్తులను ఓబీసీ జాబితాలో త్వరగా చేర్చేందుకు కృషి చేయాలని ఆరె కులస్తులు కోరుకుంటున్నారు. ఓబీసీ సర్టిఫికెట్ కోసం ఆరె కుల సంక్షేమ సంఘం నాయకులు గత 10 సంవత్సరాల నుండి తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇలా వ్యవసాయంతో గిట్టుబాటు ధర లేక, వ్యవసాయంనే నమ్ముకుని వ్యవసాయం చేస్తున్నటువంటి ఆరె కులస్తులను, చదువుతున్న యువతను ప్రభుత్వం ఆదుకునే దిశగా ప్రయత్నం చేయాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెండుగా కల్పించాలి. చత్రపతి శివాజీ మహారాజును దైవంగా భావించే ఆరె కులస్తులను గుర్తించాలి. అందుకే తెలంగాణ రాష్ట్రంలో ఆరె కులస్తుల జనాభా ఎక్కువగా ఉంటుంది. వారి అభివృద్ధి కోసం రూ.500 కోట్లతో ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలి.

ఇందిరమ్మ రాజ్యం అంటే జర్నలిస్ట్ పై దాడి చేయడమా..?

జర్నలిస్ట్ లపై ప్రభుత్వం దాడులు హేయమైన చర్య

జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్

జగిత్యాల జులై 11 (ప్రజామంటలు): ఇందిరమ్మ రాజ్యం అంటే ప్రజాస్వామ్యం కు నాలుగో స్థంభం అయిన జర్నలిజం పై ఉక్కు పాదం మోపుతూ, జర్నలిస్ట్ లపై దాడులు చెయ్యడమా అని జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో జర్నలిస్ట్ లకు రక్షణ కరువైందన్నారు. విధి నిర్వహణలో భాగంగా జర్నలిస్ట్ లు కవరేజికి వెళ్తే, కవరేజ్ కి వెళ్లిన జర్నలిస్ట్ పై దాడులు చేయడం పై దురదృష్టకరం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీడియా పై దాడులు మొదలవడం ప్రజాస్వామ్యం కే మాయని మచ్చ అని అన్నారు. గతంలో న్యూస్ లైన్ రిపోర్టార్ జర్నలిస్ట్ శంకర్ పై దాడులు చేశారని, ఇటీవల బాల్కంపేట ఎల్లమ్మ తల్లీ బోనాల కవరేజి కి వెళ్లిన 10 టివి ఛానల్ మహిళా జర్నలిస్ట్ పై పోలీసులు దురుసుగా ప్రవర్తించరాని గుర్తు చేశారు. ప్రజా పాలన అంటూనే ప్రజల పక్షంగా, ప్రజలు ప్రభుత్వం కు మధ్య వారిదిగా ఉండే మీడియా ప్రతినిధులపై దాడులు చేయడం ఏంటని వసంత ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉద్యమ కాలం నాటి పరిస్థితి కనిపిస్తుందని గుర్తు చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులు తమ ఇబ్బందులు ప్రభుత్వం కు విన్నవించే ప్రయత్నం చేస్తే పట్టించుకోని ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో పరీక్షల నిర్వహణ చేస్తుందని, దీంతో అగ్రహించిన విద్యార్థులు, అభ్యర్థులు నిరసనలు దిగితే వారి వెనక రాజకీయశక్తులు ఉన్నాయని, కోచింగ్ సెంటర్ ల మాఫియా ఉందని సీఎం స్థాయిలో ఉన్న రేవంత్ రెడ్డి మాట్లాడ్డం విచారకరం అన్నారు. సీఎం ప్రకటనపై నిరుద్యోగులు ఆందోళన చేస్తే వాస్తవాలు పరిగణలోకి తీసుకోవాల్సిన ప్రభుత్వం ఏకపక్షంగా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడే విధంగా చర్యలు చేపట్టడం దురదృష్టకరం అన్నారు. నిరుద్యోగుల ఆకాంక్షలను తొక్కివేసిన ప్రభుత్వం, వారి ఆకాంక్షలను ప్రపంచానికి చూపించేందుకు వెళ్లిన జర్నలిస్ట్ లపై దాడులు జరపడం, వారిపై దురుసుగా ప్రవర్తించడం నియంత పాలనకు నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పరీక్షల విషయంలో పునరాలోచన చెయ్యాలని, జర్నలిస్ట్ లపై దాడులు నిలువరించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మీడియాపై జర్నలిస్ట్ పై దాడులకు దిగితే బీఆరెస్ పార్టీ ఊరుకోబోధని, జర్నలిస్ట్ లకు అండగా నిలిచి, ప్రభుత్వ విధానాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు.

గొల్లపెల్లిలో రోడ్డు మైసమ్మ కార్యక్రమం

గొల్లపల్లి జులై 11 (ప్రజామంటలు): గొల్లపెల్లి మండల కేంద్రంలో శ్రీ బాలాజీ ట్రాలీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రోడ్డు మైసమ్మ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీ బాలాజీ ట్రాలీ ఆటో యూనియన్ అధ్యక్షులు నేరేళ్ళ మహేష్, ఉపాధ్యక్షులు తాండ్ర కిరణ్, కోశాధికారి సామల వీరస్వామి, నలువాల అంజయ్య, చీపెల్లి రాజయ్య, జేరిపోతుల అంజయ్య, లింగయ్య, రామడుగు తిరుపతి, వంశీ, రాజేష్, శ్రీనాథ్, రాజేందర్, శ్రీరామ్, నరేష్, మహేశ్, నర్సయ్య మరియు ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు

భీమదేవరపల్లి జూలై 11 (ప్రజామంటలు): మండలంలోని ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి సంజయ్ కుమార్ జన్మదిన సందర్భంగా మండల బిజెపి నాయకులు, మండల అధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ, కార్పొరేటర్ స్థాయి నుండి కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి వరకు ఎదిగిన బండి సంజయ్ ని స్ఫూర్తిగా తీసుకొని భాజపా కార్యకర్తలు ముందు కెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గందు సారయ్య, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు ఊసకోయిల కిషన్, ప్రధానకార్యదర్శి శ్రీ రామోజు శ్రీనివాస్, అంబీర్ కవిత, దొంగల వేణు, అయిత సాయి, దొంగల రాణా, బైరి సదా నందం, పోడేటి బిక్షపతి, సింగం రాజేందర్, సోప్పరి నవీన్, బైకనీ రంజిత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

పట్టణవీధుల గుండా శోభాయమానంగా ప్రారంభమైన రథయాత్రలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత సురేష్ దంపతులు.



బండి సంజయ్ జన్మదినం సందర్భంగా రక్త దానం

భీమదేవరపల్లి జులై 11 (ప్రజామంటలు): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన సందర్భంగా మండల అధ్యక్షులు పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు రక్త దానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, సిద్ధిపేట్ జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి హాజరైనారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ ప్రభారీ గుజ్జా సత్యనారాయణ రావు, హుస్నాబాద్ నియోజకవర్గం మండల అధ్యక్షులు, జిల్లా రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీయర్ స్వామికి పండితుల పరామర్శ

కరీంనగర్ జులై 11 (ప్రజామంటలు): తెలంగాణ తొలి జీయర్ స్వామి శ్రీశ్రీశ్రీ కృష్ణ యతీంద్ర రామానుజ జీయర్ స్వామి వారు అనారోగ్యంతో ఉండటం చేత ఇటీవలనే హైదరాబాదు నుండి కరీంనగర్ కు తరలించారు. వారిని మయూరగిరి పీఠాధిపతులు జ్యోతిష్య వాస్తు ఆగమ శాస్త్ర పండితులు నమిలకొండ రమణాచార్య స్వామి వారు మరియు వైష్ణవ సంఘం అధ్యక్షులు పీచర కృష్ణమాచార్యులు పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. విశిష్టాద్వైత పీఠాన్ని స్థాపించి ఎన్నో పుస్తకాలను ముద్రించి ఒక ఆధ్యాత్మిక చైతన్యాన్ని తీసుకు వచ్చిన మహానుభావుడని తెలంగాణ తొలి జీయర్ స్వామి వారని రమణాచార్యులు తెలియపరిచారు. కరీంనగర్ చెందిన పలువురు పండితులు, ఆధ్యాత్మిక భక్తులు, ప్రముఖులు పరామర్శిస్తున్నారు. ఇటీవలనే శ్రీశ్రీశ్రీ దేవనాథ జీయర్ స్వామి వారు పరామర్శించిన విషయం మనకు తెలిసినదే.

జగిత్యాల పట్టణ మేరు సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆషాడ మాస పోచమ్మ తల్లి బోనాల పండుగ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. పాల్గొన్న సంఘ అధ్యక్షులు మారిశెట్టి మల్లేశం, ఉపాధ్యక్షులు రాగిల్ల నారాయణ, ప్రధాన కార్యదర్శి రాపర్తి గణేష్, క్యాషియర్ మ్యాదరి మహేష్, సభ్యులు గట్ల కిషన్, గట్ల శ్రీనివాస్ , కొక్కు శ్రీనివాస్, తదితరులు

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించండి

సీఎం ను కోరిన పెన్షనర్లు

జగిత్యాల జులై 11 (ప్రజామంటలు): సుదీర్ఘకాలంగా ప్రభుత్వ ఉద్యోగం చేసి పదవి విరమణ చేసిన పెన్షనర్ల సమస్యల పెండింగు లో ఉన్నాయని సత్వరమే పరిష్కరించేలా అదేశాలివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపిన మెమోరాండంలో పెన్షనర్లు కోరారు. గురువారం తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర శాఖ పిలుపులో భాగంగా జగిత్యాల రిటైర్డ్ ఉద్యోగులు కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి కి మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమం జిల్లా అధ్యక్షులు ఎల్లా గంగరాజం అధ్యక్షతన జరుగగా ఇందులో అన్ని మండలాల యూనిట్ ప్రతినిధులతోపాటు పట్టణ పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎల్లా గంగరాజం మాట్లాడుతూ ఉద్యోగుల హెల్త్ స్కీము ద్వారా మూల వేతనం నుంచి ఒక శాతం మినహహించి నగదు రహిత సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కమిటేషన్ పద్ధతిలో 15 సంవత్సరాల నుంచి 12 ఏండ్లకు తగ్గించాలని కోరారు. పెన్షనర్లకు బకాయి ఉన్న పెండింగ్ డి.ఏ లను వెంటనే విడుదల చేయాలని కోరారు. 398 వేతనంతో ఉద్యోగంలో చేరిన ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎల్లా గంగరాజం కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కరభూజ రవీందర్, కోశాధికారి మెట్ట మల్లి ఖార్జున్, అసోసియేషన్ అధ్యక్షులు వనమాల సత్యనారాయణ, గుండేటి గంగాధర్, ఎస్.గంగారాం, కమలాకర్ రెడ్డి, ప్రభాకర్ రావు, విటలయ్య, యూనిట్ 2 వైద్య బాల మురళీకృష్ణ, కంటే అంజయ్య, గుండేటి రవీందర్, చిన్న రాజయ్య, వేల్పుల ప్రతాప్, కమలాకర్ రావు తోపాటు కోరుట్ల, మెట్ పెల్లి, రాయికల్, ధర్మపురి, కోడిమ్యాల, మల్యాల ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

(రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి జులై 11 (ప్రజామంటలు): రాష్ట్ర ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం లో ప్రతి ఒక్కరూ పాల్గొని మొక్కలు నాటాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ అన్నారు. 75 వ ఇందిర వన మహోత్సవంలో భాగంగా ధర్మపురి క్షేత్రంలో ఆర్టీసీ బస్ స్టేషన్ లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పాల్గొని మొక్కలు నాటారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపెల్లి పార్లమెంట్ ఎంపి గడ్డం వంశీ, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ తో కలిసి ధర్మపురి పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గడ్డం వంశీకృష్ణ పెద్దపెల్లి పార్లమెంట్ ఎంపి గా గెలుపొంది మొదటిసారి ధర్మపురికి వచ్చిన సందర్భంగా ఎంపీకి స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో మండల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. వన మహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటిన అనంతరం వక్తలు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 46 లక్షల మొక్కలు నాటాలని సంకల్పించడం జరిగిందని, ప్రతి ఇంటికి 6 మొక్కలు పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రజలు కోరుకున్న విధంగానే పూలు, పండ్ల మొక్కలనే పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని వాటిని పర్యవేక్షించలసిన బాధ్యత అధికారులు తీసుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.

మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ: గురువారం ధర్మపురి నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), పురపాలక సంఘం ఆధ్వర్యంలో 185 మహిళా సంఘాలకు 14 లక్షల 22 వేల 643 రూపాయల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యులు ఈ చెక్కును సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా సభ్యులందరూ తోడ్పాటు చేసుకోవాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ స్త్రీ శక్తి, మహిళా శక్తి కార్యక్రమాలను ప్రభుత్వం సీరియస్ గా తీసుకుందని, జిల్లాకు మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయడానికి టార్గెట్ కూడా ఇవ్వడం జరిగిందని, ప్రజలు ఎక్కువగా వచ్చే ధర్మపురి నియోజకవర్గంలో ఈ క్యాంటీన్ లు ఏర్పాటు చేయడం వల్ల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని కలెక్టర్ తెలిపారు. యాక్టివ్ గా ఉన్న మహిళా సంఘాల సభ్యులను నమోదు చేసుకుంటే ప్రభుత్వం నుండి గైడ్ లైన్స్ రాగానే క్యాంటీన్ ఏర్పాటు చేస్తామని తద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా అధికారులు, సిబ్బంది, మండల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో మౌలిక వసతుల కల్పన: ధర్మపురి క్షేత్రం లోని శ్రీ లక్ష్మీ నరసింహ సంస్కృత ఆంధ్ర కళాశాలలో మౌలిక వసతులు కల్పిస్తానని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, కలెక్టర్ సత్య ప్రసాద్ తో కలిసి ఓరియంటల్ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరు ఈ కాలేజీ ని ఉపయోగించుకోవాలని కోరారు. కాలేజీ పరిసరాలు పరిశీలించి అవసరమైన అన్ని వసతులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, తహశీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపిడిఓ, ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లీ.. అందర్నీ చల్లగా చూడమ్మా..

మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

జగిత్యాల జులై 11 (ప్రజామంటలు): పట్టణంలోని 15,16 వార్డులలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి గురువారం ఘనంగా బోనాలు తీశారు. పట్టణ కేంద్రంలోని పోచమ్మ ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, మాజీ జెడ్పీ ఛైరపర్సన్ దావ వసంత సురేష్ హాజరై భోనం ఎత్తుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.... పిల్లా పాపలు, పాడి పంటలు సమృద్ధిగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్, వార్డు సభ్యులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జనాభా విస్ఫోటనంపై చర్చించాలి !

ప్రతి ఏటా జూలై 11వ తేదీన 'ప్రపంచ జనాభా దినోత్సవాన్ని' నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదలకు, తరుగుదలకు సంబంధించిన విషయాల గురించి ప్రజలలో చైతన్యం తెచ్చేందుకుగాను ఐక్యరాజ్యసమితి 1989వ సంవత్సరం లో దీనిని ప్రారంభించింది. జనాభా నియంత్రణ అన్నది ఎవరికి వారు నిర్దేశించుకోవాల్సిన పరిణామం. రానున్న పార్లమెంట్ సమావేశంలో మన ప్రతినిధులు దీనిపై చర్చించాలి. ఇప్పటికే 140 కోట్లకు జనాభా చేరుకున్న క్రమంలో జనాభా నియంత్రణపై దృష్టి సారించాలి. లేకుంటే భారతదేశ వనరులు బతకడానికి సరిపోవు. జనభా నియంత్రణపై ప్రభుత్వం అంకుశం పెట్టి చెప్పడంలేదు. చైనాలాగా నియంత్రించడంలేదు. అయినా చాలా దేశాలు దీన్ని పట్టించుకోక పోవడం వల్ల అనేకానేక సమస్యలు ఎదుర్కొంటు న్నాయి. జన విస్ఫోటనంతో ఎన్ని రకాల విపరీత పరిణామాలు జరగాలో అన్నీ జరుగుతన్నాయి. పర్యావరణ విపరీత పరిస్థితుల కారణంగా అధిక వర్షాలు లేదా, అస్సలు వర్షాలు పడక పోవడం, వనరులన్నీ తగ్గిపోవడం వంటి విపరీత పరిణామాలు చూస్తున్నాం. ఎన్న విపరీత పరిణామాలు చూస్తున్నాం. అవన్నీ అనుభవంలోకి స్తున్నాయి. ఎన్ని దుష్ప్రభావాలు కలగాలో కలుగుతున్నాయి. ప్రకృతి విధ్వంసం జరిగింది. ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. ఉన్న వనరుల విధ్వంసం జరిగింది. జనాలకు సరిపడా ఆహారధాన్యాలు అందడం లేదు. పంటలు తక్కువ....తినేవారు ఎక్కువయ్యారు. నిరుద్యోగం తాండవిస్తోంది. నానాటికి ప్రపంచంలో జనాభా పెరుగుతోంది. నానాటికి పెరుగుతున్న జనాభా..తద్వారా తలెత్తే దుష్పరి ణామాలను ప్రజలకు వివరించేందుకు, వారికి ఆయా సమస్యలపై అవగాహన కలిగించేందుకు పల్లెలు, పట్టణాలు, నగరాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. హోటళ్ళు, సినిమా హాళ్ళు, షాపింగ్ మాల్స్, కూరగాయల మార్కెట్లు, హాస్పటల్స్.. ఇలా ఒకటేమిటి బ్యాంకుల నుండి బట్టల దుకాణాల వరకు ఎక్కడ చూసినా జనం. ఇసుక వేస్తే రాలనంత మంది జనంతో ప్రతీ ప్రాంతం కిటకిట లాడుతున్నది. దీంతో నివాస స్థలాలు కూడా భారంగా మారయి. ఇల్లు అందరికీ హక్కు అన్నది పోయి అదో కలగా మిగిలింది. నియంత్రణ లేకపోవడంతో ప్రపంచ జనాభా విపరీతంగా పెరిగి పోతున్నది. పెరిగిన జనాభా వలన పలు ప్రపంచ దేశాలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించ లేక సతమతమ వుతున్నాయి. విద్య,వైద్యం,ఆరోగ్యం, త్రాగునీరు, పారిశుధ్యం వంటి అనేక అంశాల్లో ప్రభుత్వాలు ప్రజలకు న్యాయం చేయలేక పోతున్నాయి. పెరుగుతున్న జనాభా కారణంగా కనీస వసతుల కల్పన ఏ ప్రభుత్వాని కైనా తలకుమించిన భారంగా మారుతోంది. గృహకల్పన, అక్షరాస్యత, నిరుద్యోగం, పౌష్టికాహారం, ఉద్యోగ కల్పన వంటి అంశాలు విషమ సమస్యలు గా మారాయి. ప్రకృతి వైపరీత్యాలతో అనేక దేశాలు సతమతమవు తున్నాయి. చాలా దేశాల్లో ఈనాటికీ కనీస విద్య గగకుసుమంలా మారింది. ఆహార సమస్యతో అనేక దేశాలు అలమటిస్తున్నాయి. కోవిడ్ ప్రపంచ దేశాల ఆర్థిక పరిస్థితులను తల్లక్రిందులు చేసింది. కోవిడ్ మహమ్మారి సృష్టించిన అల్లకల్లోల పరిస్థితులు సమసిపోతున్న తరుణంలో రష్యా- ఉక్రెయిన్ల మధ్య తలెత్తిన యుద్ధంతో ప్రపంచం ఒక భయానక ఆర్థిక సంక్షోభాన్ని చవిచూస్తున్నది. అగ్రరాజ్యాలు సైతం ఆర్థికంగా అనేక సమస్య లు ఎదుర్కొంటున్నాయి... అన్నింటికి మించి ఆరోగ్య రంగంలో ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ విషయంలో ప్రపంచంలోని అనేక దేశాలు వెనుకబడి ఉన్నాము. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన సహస్రాబ్ది లక్ష్యాలను కూడా చేరుకోలేదు. అందరికీ ఆరోగ్యం అన్న లక్ష్యానికి ఇంకా దూరంగా వుండడానికి అధిక జనాభాయే కారణం. అయితే కొన్ని అంశాలలో అంతర్జాతీయ స్థాయి వైద్యం అందిస్తున్నామని చెప్పుకుంటున్నా... నేటికీ సామాన్యులకు అది కలగానే మిగిలింది. ఫార్మా, వ్యాక్సిన్ల రంగాల్లో ముందంజ వేస్తున్నా..జనాభాకు సరిపడా అందించలేని దుస్థితిలో ప్రపంచం ఉంది. మొత్తం మీద అధికా జనాభా ప్రధానంగా ఆరోగ్యరంగం అసమానతలకు కారణంగా మారింది. ఆధునిక జీవన శైలి, వివిధ రకాల ఆహారపు అలవాట్లతో మూడు ప్రధాన సమస్యలు మానవాళిని వెంటాడుతున్నాయి. ప్రస్తుతం రక్తపోటు, షుగర్ అనేవి చాలా సాధారణంగా మారిపోయాయి. కేవలం నగరాలు, పట్టణాలు కాకుండా పల్లెల్లోనూ ఈ సమస్యలు వెంటాడుతున్నాయి. కేవలం పని ఒత్తిడి కారణంగా ఈ జబ్బులు వస్తున్నాయన్నది సుస్పష్టం. సరైన ఆహారం తీసుకోకపోవడం, చిన్నారులు ఎక్కువగా ఎలక్ట్రానిక్ పరికరా లకు అలవాటు పడడం కారణాలుగా ఉన్నాయి. భారతదేశంలో ఊబకాయం కేసులు వేగంగా పెరుగుతున్నాయి. దీని కారణంగా ప్రజలు తీవ్రమైన వ్యాధుల బారిన పడుతు న్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఊబకాయం అనేది చిన్న సమస్య కాదని, ఇది ఒక వ్యాధిగా వృద్ధి చెందుతుందని చెప్పింది. స్థూలకాయం అంటే శరీరంలో కొవ్వు ఎక్కువగా ఉండట మని నిర్వచించారు. ఆకలిని అధిగమించేందుకు అడ్డమైన గడ్డీ తినడం వల్ల కూడా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఇలాంటి వారికి సకాలంలో వైద్యం అందించాలన్నా ఖరీదుగా మారింది. ప్రపంచంలో జనాభా పెరుగుదలను కట్టడి చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వాలు లేకపోవడం ఈ దారుణానికి కారణంగా చూడాలి. ముఖ్యంగా భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ లాంటి దేశాలు జనాభా నియంత్రణపై దృష్టి పెట్టడం లేదు. దీంతో పెరుగుతున్న జనాభాతో వనరులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇది సకాలంలో చర్చించాల్సిన అతిపెద్ద సమస్యగా చూడాలి. జనాభా పెరుగు తున్న కొద్దీ సమస్యలు కూడా వాటంతట అవే పెరుగుతాయని గుర్తించాలి. ప్రతి కుటుంబం తమకు తాముగా జనాభా నియంత్రణకు కట్టుబడాలి. లేద ప్రభుత్వాలు అయినా నియంత్రణకు కఠిన చట్టాలు అమలు చేయాలి. లేకుంటే మరో పదేళ్లలో ఈ సమస్యను పరిష్కరిచలేని దశకు చేరుకోగలం. ఇది అతిపెద్ద ఉత్పాతంగా గమనించాలి. అందుకు నియంత్రణ ఒక్కటే మార్గమని గుర్తించాలి. అప్పుడే ఈ భూమి మనకు రక్షణగా నిలుస్తుంది. లేకుంటే ప్రకృతి విపత్తులకు సామూహిక బలికాక తప్పదు.

ఆత్మకూరు అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన

గొల్లపల్లి జులై 11 (ప్రజామంటలు): గొల్లపల్లి మండలము ఆత్మకూరు అంగన్వాడీ కేంద్రంలో అన్న ప్రసన్న కార్యక్రమం సూపర్వైజర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 6 నెలలు దాటిన పిల్లలకు అంగన్వాడి కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించి తల్లులకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు ఆరు నెలలు దాటిన పిల్లలకు తల్లిపాలతో పాటు అనుబంధాహారం మొదలు పెట్టవలెనని అంగన్వాడీ కేంద్రంలో పిల్లల యొక్క పొడవు, బరువు, చూపించుకొని రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు కొనసాగించవలెనని తల్లి రోజు ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, పాలు, గింజ ధాన్యాలు తీసుకొనవలనని తేలిపారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఏ సూపర్వైజర్ మమత అంగన్వాడి టీచర్ వసంత, ఆయా శాంత, తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన ఎస్ఐ అశోక్

రాయికల్ జూలై 11 (ప్రజామంటలు): రాయికల్ ఇటిక్యాల్ మధ్యలో ఉన్న బ్రిడ్జి గత వర్షాకాలం దెబ్బ తినడం అటు వెళ్లే ప్రయాణికులకు ఎంతో ఇబ్బందికరంగా మారింది. నూతన బాధ్యతలు చేపట్టిన ఎస్సై అశోక్ వాగుకు ఇరువైపుల దిమ్మెలకు ప్రమాద హెచ్చరికలు తెలిపే రేడియం తో పాటు వాగుకు ముందర నెమ్మదిగా వెళ్లే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించారు. ప్రజా ప్రతినిధులు నాయకులు ఎస్ఐని అభినందించారు.

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా

హై స్కూల్ విద్యార్థుల ర్యాలీ

భీమదేవరపల్లి జూలై 11 (ప్రజామంటలు): ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని గురువారం వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో భీమదేవరపల్లి జెడ్పి హై స్కూల్ విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వంగర పిహెచ్సి డాక్టర్లు రెహమాన్, రుబీనా మాట్లాడుతూ, జనాభా నియంత్రణకు ప్రాధాన్యతనిస్తూ, దేశ సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేద్దామని అధ్యాపకులు, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ముతార్ రహమాన్, డాక్టర్ రుబీనా, కేఎల్ఎన్ స్వామి, వాణి, శ్యామల, స్వరూప, రాణి, జెడ్పి హైస్కూల్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కవిత్వం

పాలిట్రిక్స్

పదేళ్ల పరిపాలన
ట్రైలర్ మాత్రమేనట,
ముందుంది అసలు
సిసలు సినిమానట !
ఆర్థికంగా పుంజుకున్నా
అప్పులకే సరిపోవు,
పేదల సంక్షేమం
పేరుకే ఉండిపోవు !

-న్యాలకంటి నారాయణ
9346200066

ఉపాధ్యాయునిగా మారిన మున్సిపల్ కమిషనర్

జగిత్యాల జులై 11 (ప్రజామంటలు): జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య గురువారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునిగా అవతారం ఎత్తాడు. వివరాలకు వెళ్తే గురువారం స్థానిక మినీ స్టేడియంలో హరితహారం లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించటానికి పనుల పర్యవేక్షణకు మినీ స్టేడియం సందర్శించారు. అక్కడ ఉన్న వాకర్స్ తో కాసేపు ముచ్చటించారు. అనంతరం రైతు బజార్ వద్ద రోడ్డుపైన కూరగాయలు అమ్ముతున్న వ్యాపారస్తులతో మాట్లాడి క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. మార్గమధ్యలో ఉన్న ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఆవరణ అంతా కలియతిరిగి పారిశుద్ధ్య సిబ్బందితో పరిసరాలు శుభ్రం చేయించారు. అనంతరం విద్యార్థులకు ప్రేరణ కలిగేలా ఉపాధ్యాయునిగా వ్యవహరించి తెలుగు వర్ణమాలతో పాటు గణితంలోని పలు అంశాలను విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విద్యార్థులు భావి జీవితంలో భావి భారత పౌరులుగా ఎదగడానికి ప్రాథమిక విద్య సమయంలో నేర్చుకున్న అంశాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. ఆయన బోధన విధానాన్ని చూసి చిన్నారులు అబ్బురపడ్డారు.

ఎవరికి ఏ హక్కుంది...?

శ్రమించే వాడికే...
శపించే హక్కుంది
శ్రమ దోపిడి చేస్తే...

ప్రాణాలర్పించేలా
ప్రేమించిన వాడికే...
ప్రాణాలు తీసే హక్కుంది
నమ్మించి నట్టేట
ముంచితే...

దుక్కి దున్ననోడికే...
విత్తు నాటినోడికే...
నారు పోసినోడికే...
నీరు పెట్టినోడికే...
పండిన పంటను నూర్చే
హక్కుంది
రేయింబవళ్ళు రెక్కల్
ముక్కల్ జేసి
రక్తాన్ని స్వేదంగా
చిందించినందుకే...

అడగక ఇచ్చినోడికే...
అడగకుండా పుచ్చుకునే
హక్కుంది
ఆపద్బాంధవుడే ఆపదలో
చిక్కుకుంటే...

ఆశించేవాడికే...
శాసించే హక్కుంది...
పాలకుల పాపం పండితే...
రాజ్యకాంక్షతో....రాక్షస
పాలన సాగిస్తే...
ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తే
కూలదోస్తే...

రచన:
"కవి రత్న"
"సహస్ర కవి భూషణ్"
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్
చరవాణి..

సనాతన ధర్మ రక్షణపై రేపే చర్చాగోష్ఠి

సికింద్రాబాద్ జూలై 11 (ప్రజామంటలు): సనాతన ధర్మ రక్షణలో నేటి గుళ్ళు, ఆర్య సమాజముల ప్రస్తుత పాత్రపై చర్చాగోష్ఠిని ఈనెల 13 రేపు శనివారం సికింద్రాబాద్ బౌద్ధనగర్ డివిజన్ లోని రామాలయంలో సనాతన ధర్మసేవ సంఘటన భాగ్యనగరము ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పృథ్వీరాజ్, ఆర్య, జయరాజ్ ఆర్య లు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో భరద్వాజ్, జయప్రకాష్, సుబ్బరాజు, రాంబాబు, గోపాల్, సాయి, కుమార్, రాజు, వినయ్ సత్యనారాయణ, కుల్దీప్, సుధాకర్ లు హాజరవుతారన్నారు. ఈ చర్చా గోష్ఠి కార్యక్రమానికి హిందు బంధువులు రావాలని ఆహ్వానించారు.

వ్యాసకర్తలకు వినతి

రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.

mantalukathalu@gmail.com

-ఎడిటర్

దేవుడి డైలమా



ఆ రోజు మహా పర్వదినం. దేశమంతటా అన్ని గుళ్ళలో పూజలు, పునస్కారాలు ,జప తపాదులు, జరిగిపోతున్నాయి. వేదఘోషతో, అభిషేకాదులతో గుళ్ళు ప్రతి ధ్వనిస్తున్నాయి. మైకులలో, ఫలానా గోత్రం , ఫలానా నామం, కలవాళ్ళు పూజలు చేయించుకుంటున్నారని, ప్రకటనలు వినపడుతున్నాయి. ఆ సమయంలోనే సుబ్బారావు, తన కొడుకు పేర ,పూజలు చేయిస్తున్నాడు. పూజారి అడిగినప్పుడు సుబ్బారావు తన గోత్రం, కొల్లేటి చాంతాడంత, తన పేరు చెప్పాడు. మూడుసార్లు అడిగిన తరువాత గానీ, సుబ్బారావు పూర్తి పేరు, పూజారి చెప్పలేకపోయాడు. సుబ్బారావు తన కొడుకు పేరు చెప్పాడు. "విద్యుత్". అంత చిన్న పేరు, తిరిగి చెప్పడానికి, పూజారికి, చాలా తేలిక అనిపించింది. అయన సంతోషించాడు .

"చక్కటి పేరు పెట్టారు సుబ్బారావు గారు" అని పూజారి, సుబ్బారావుని , మెచ్చుకున్నాడు. చుట్టు ప్రక్కల వాళ్ళంతా కూడా, సుబ్బారావుని, కొడుకుకి, అంత చక్కటి పేరు పెట్టినందుకు, అభినందించారు. సుబ్బారావు ఛాతి గర్వంతో పొంగిపోయింది.

ఇక దేవ లోకంలో, ఆ రోజు ,ఎవరు ఏఏ పూజలు చేసారో, నమోదు చేయబడుతోంది.అక్కడ ఎంత పెద్ద సూపర్ కంప్యూటర్ ఉందోగానీ, అంతా పకడ్బందీగా జరిగిపోతోంది.పూజలు చేయించిన వాళ్ళకి ,వాళ్ళ, వాళ్ళ ఖాతాలలో, పుణ్యం నమోదు అయిపోతోంది. అంతలో అక్కడ ఒక సమస్య వచ్చి పడింది. దానికి పరిష్కారం చిన్న ఉద్యోగులకి, బుర్రలు బద్దగొట్టుకున్నా ,ఎవ్వరికీ అంతు పట్టలేదు. అందుకని విషయాన్నీ తిన్నగా దేవుడికి విన్నవించారు. జరిగిందేమిటంటే ఫలానా గోత్రంలో "విద్యుత్" అనే పేరున పూజ జరిగింది.కానీ అదే గోత్రం , అదే పేరుతో చాలా మంది ఉన్నారు? పూర్వకాలం అయితే, అన్ని మొక్కులు,దేవుళ్ళు, ఇంటి పెద్దల పేర్లూ , అన్నీ కలిపిన పేర్లు పెట్టేవారు .అంత పెద్ద పేర్లు కావడం చేత ,ఏ రెండు పేర్లు ఒకలా ఉండేవి కాదు. కానీ ఇప్పుడన్నీ రెండక్షరాల , మూడక్షరాల పేర్లే?

దేవుడుకి ఏమీ పాలు పోలేదు.ఎంత ఆలోచించినా ,ఒక నిర్ణయానికి , రాలేకపోయాడు.పూజ ఎవరి పేరున జమ చెయ్యాలో, తెలియక తికమక పడ్డాడు. 'ఈ మోడరన్ పేర్లతో వచ్చిన సమస్య ఇదే' అంటూ విసుక్కున్నాడు దేవుడు.

ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్
98490 13002

అక్రమ గంజాయి పై జగిత్యాల జిల్లా పోలీస్ ఉక్కుపాదం

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర నిందితులు, స్థానికంగా కొనుగోలు చేసే వ్యాపారీ అరెస్ట్ నిందుతుల వద్ద 6.03 కిలోల గంజాయి సీజ్

అక్రమంగా గంజాయి సేవించిన, విక్రయించిన, కలిగి ఉన్న కఠిన చర్యలు తప్పవు

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్

జగిత్యాల జిల్లా ప్రతినిధి జులై 11 (ప్రజామంటలు): జల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ధర్మపురి పోలీసులు ఛేదించిన అంతర్రాష్ట్ర డ్రగ్ (గంజాయి) రాకెట్, ముగ్గురు నిందితులను బుధవారం రాత్రి సమయంలో అరెస్టు చేశారు. ఇందులో ఇద్దరు చిరువ్యాపారులు ఒకరు ఒడిశా రాష్ట్రానికి చెందినవారు,మరొకరు ఏపీ రాష్ట్రానికి చెందినవారు. కొనుగోలుదారుడు జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామం కి చెందినవాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల, జులై 04న ధర్మపురి పీయస్ లో యన్ డీపీ యస్ చట్టం కింద బత్తిని చందు, గొల్ల వెంకటేష్, దుర్గం రాము ధర్మపురి మండలానికి చెందిన దొంతాపూర్ గ్రామం, వారి పై ధర్మపురి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయబడింది. జులై 03న ఆ కేసు,బత్తిని చందు, గొల్ల వెంకటేష్ లను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు. అయితే దుర్గం రాములు పరారీలో ఉన్నాడు. నిందితుడు దుర్గం రాము ని పట్టుకునేందుకు యత్నిస్తుండగా, బుధవారం సాయంత్రం ధర్మపురి మండలం బుద్దేష్‌పల్లి గ్రామ బస్టాప్‌లో ఉన్న నిందితుడు దుర్గం రాము గురించి పి ఉదయ్ కుమార్, ధర్మపురి ఎస్ఐకి సమాచారం అందింది. పై సమాచారం అందుకున్న యస్ ఐ ధర్మపురి,సిబ్బంది చెప్పిన ప్రదేశానికి చేరుకున్నారు, అక్కడ యస్ ఐ ధర్మపురి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన వ్యక్తుల వద్ద 6.030 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.తదుపరి విచారణలో, నిందితుడు ఎ-2: ఒడిశా రాష్ట్రం రాయగడకు చెందిన దినేష్ కుమార్ నాయక్ గంజాయి ని పండిస్తున్నాడు నిందితుడు ఎ -3: గుజ్జల పురుషోత్తం ఏపీ రాష్ట్రం విజయనగరానికి చెందినవాడు సరఫరాదారుడు అని అంగీకరించి మధ్యవర్తిగా పనిచేస్తూ కమీషన్ పద్ధతిలో గంజాయిని విక్రయిస్తున్నాడు. నిందితుడు ఎ-1: దుర్గం రాము దొంతపూర్, ఎ -4: సునర్కని అజయ్, ఎ -5 దుర్గం సంజయ్ మగ్గిడి గ్రామం వారు ఒడిశా రాష్ట్రానికి చెందిన ఎ -2 దినేష్‌కుమార్ నాయక్ రాయఘడ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఏ-3 గుజ్జెల పురుషోత్తంరావు విజయనగరంకు 2 సంవత్సరాల క్రితం పరిచయం ఏర్పడింది. బత్తిని చందు రాయపట్నం, గొల్ల వెంకటేష్ రాయపట్నం, దుర్గం రాము దొంతపూర్, సునర్కాని అజయ్ దొంతపూర్, దుర్గం సంజయ్ మగ్గిడి అనువారు ఒడిశా రాష్ట్రం లోని రాయగడ వెళ్ళి, రాయఘడ రైల్వేస్టేషన్‌లో ఎ-2 దినేష్, ఎ -3 పురుషోత్తంలను కలుసుకొని వారి వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసేవారు.ఒడిశా రాష్ట్రానికి చెందిన ఎ -2 దినేష్ కుమార్ నాయక్ రాయఘడ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎ -3 గుజ్జెల పురుషోత్తం రావు విజయనగరం గంజాయిని విక్రయించడం ద్వారా త్వరగా, సులభంగా డబ్బు సంపాదించడానికి ఈ ప్రాంతంలో తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేయాలని ప్లాన్ చేశారు. మొదటి సారి ఈ ప్రాంతానికి వచ్చి ఎ -1 దుర్గం రాముడిని కలుసుకుని ధర్మపురి మండలం బుద్దేష్‌పల్లి గ్రామంలో 6 కిలోల గంజాయిని అందజేసి ఎ -4 సునర్కని అజయ్, ఎ -5 దుర్గం సంజయ్ పరారీలో ఉన్నట్లు గుర్తించారు.పై విషయాలతో పీయస్ ధర్మపురి లో యన్ డి పి యస్ -1985 యాక్ట్ యొక్క సి ఆర్ .నం 219/2024 యు /యస్ 20 (b) (ii) (_) యన్ డి పీ యస్ చట్టం క్రింద నమోదు చేయబడింది దర్యాప్తు చేయబడింది. నిందితుడు ఎ -2: దినేష్ కుమార్ నాయక్ గతంలో విజయనగరం జీ ఆర్ పి పోలీస్ స్టేషన్‌లో ఎన్‌డిపిఎస్ చట్టం కేసులో ప్రమేయం ఉంది. ఒడిశా రాష్ట్రంలోని షేష్‌ఖాల్ పిఎస్‌లో పోక్సో కేసుతో పాటు రాయగడ జైలులో ఉన్నాడు, ఎ -3: గుజ్జల పురుషోత్తం కూడా గతంలో రాయగడ పీఎస్‌లో ఎన్‌డిపిఎస్ యాక్ట్ కేసు జైలుకు వెళ్లగా, ఇద్దరికీ రాయగడలో జైల్ లో పరిచయం అయినది. జిల్లాలో అక్రమ గంజాయి పై జిల్లా పోలీస్ ఉక్కుపాదం మోపారు. సమాజంలో డ్రగ్స్‌పై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసు కోవడ జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే పరిణామాల పై అవగాహన చేయడంతో పాటు వినియోగించడం వల్ల కలిగే నష్టలపై యువతకు, పాఠశాల, కళాశాల విద్యార్థులకు దిశా నిర్దేశం చేసే కార్యక్రమలు నిర్వహించడం జరుగుతుంది. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీ (ఏడీసీ)లను ఏర్పాటు చేయడం జరుగుతుంది. జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించి అక్రమ గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి ఉక్కుపాదం మోపడం జరుగుతుందన్నారు. గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని, గంజాయి కొన్న, సేవించిన, రవాణా చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్పీ గారు హెచ్చరించారు. జిల్లాలో గంజాయికి సంబంధించిన సమాచారం సబంధిత పోలీస్ వారికి, డయల్ 100 కి సమాచారం అందించి గంజాయి రహిత జిల్లాగా మర్చడంలో ప్రతి ఒక్కరు భాగ స్వామ్యం కావాలని కోరారు. ఈ యొక్క గంజాయిని పట్టుకోవడం లో ప్రతిబా కనబరిచిన డీయస్పీ డి. రఘు చందర్, ఎ. రామనర్సింహా రెడ్డి, సిఐ ధర్మపురి, పి. ఉదయ్ కుమార్ యస్ఐ, ధర్మపురి, సియచ్. సతీష్, ఎస్ ఐ గొల్లపల్లి, సిబ్బంది పీసీలు బి.రమేష్ నాయక్, బి. పూర్ణసాయి, ఎం. రమేష్, రామ స్వామి, అశోక్, ఎండి. సలీముద్దీన్, వెంకటయ్య, నవీన్, లను జిల్లా ఎస్పి అభినదించి రివార్డ్ లు అందించారు. ఈ సమావేశంలో డిఎస్పి రఘు చందర్, సి.ఐ. రామ్ నరసింహారెడ్డి రెడ్డి, ఎస్.ఐ. లు ఉదయ్ కుమార్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

పేద స్టూడెంట్స్కు వరం 'బెస్ట్ అవైలెబుల్ స్కూల్ స్కీం'

షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘ రాష్ట్ర అధ్యక్షులు సుదర్శన్

సికింద్రాబాద్ జూలై 11 (ప్రజామంటలు): పేద షెడ్యూల్ కులాలకు చెందిన చిన్నారులకు ఉచిత కార్పొరేట్ విద్యను అందించే బెస్ట్ అవైలెబుల్ స్కూల్ స్కీం ఒక గొప్ప పథకమని రాష్ట్ర షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘ అధ్యక్షుడు డి.సుదర్శన్ బాబు అన్నారు. బెస్ట్ అవైలెబుల్ స్కూల్ స్కీం కింద ప్రభుత్వం ఎంపిక చేసిన 20 మంది చిన్నారులను గురువారం భోలక్ పూర్ లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో ఉచితంగా చేర్పించారు. వీరికి ఫస్ట్ క్లాస్ నుంచి టెన్త్ వరకు స్కూల్ ఫీజు, తదితర ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. సిటీలో 11 కార్పొరేట్ స్కూల్స్ లో ఈ స్కీం అమలు అవుతుందని, గత తొమ్మిందేళ్ళుగా వందలాది మంది పేద విద్యార్థులకు ప్రైవేట్ స్కూల్స్ లో ఉచితంగా సీట్లు ఇప్పించామన్నారు. గత తొమ్మిదేండ్లుగా నిర్విరామంగా ఈ స్కీం కింద చిన్నారి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నిర్వాహకులను ఈసందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు, సిటీ ఎస్సీ ఆర్పీఎస్ అధ్యక్షులు గుంటి విజయ్ బాబు, వైస్ ప్రెసిడెంట్ కుర్మ మహేందర్, నాయకులు రాపాక అశోక్, దేశపాక గోవర్ధన్, సెల్వరాజ్, ఎల్లం కుమార్, మిద్దె లింగం, ఏసూరి మహేశ్ సావిత్రి, రాంబాబు, జనార్ధన్, పాల్గొన్నారు.

వినతి పత్రాలకు మాత్రమే పరిమితం కాకుండా నిధులు కేటాయించి త్వరలో పనులు జరిగేటట్లు చూడాలి

బిజెపి ఫ్లోర్ లీడర్ అనుమల్ల కృష్ణహరి

జగిత్యాల జులై 11 (ప్రజామంటలు): జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే స్థానిక డాక్టర్ సంజయ్ కుమార్ లు కలిసి వినతిపత్రాలు సీఎం రేవంత్ రెడ్డి కి ఇవ్వడం జరిగింది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ల పోటీ తత్వంతో సీఎం కి మెమోరండాలు సమర్పించారు. జగిత్యాలలో అభివృద్ధి కొరకు నిధులు కేటాయించి చేస్తే మా కౌన్సిల్ సమయంలో మాకు పేరు వస్తది. కావున ఈ ఐదు నెలల కాలంలో యాపర్ రోడ్డు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పూర్తి చేస్తే ప్రజలు చాలా ఆనందంగా ఉంటారు. దీనిని గమనించి కచ్చితంగా పనులు చేయాలని మేము కోరుకుంటున్నాం కేవలం వినతి పత్రాలకు పరిమితం కాకుండా ఫోటోలకే పరిమితం కాకుండా అభివృద్ధి కొరకు చేయాలని కోరుకుంటున్నాము ప్రజలు చాలా సంతోషపడతారని అనుమల్ల కృష్ణ హరి బిజెపి ఫ్లోర్ లీడర్ అన్నారు.

నేడే సిసిసి జనగామ యూట్యూబ్ ఛానెల్ లో లాహిరే లల్లాహిరే బోనాల పాట 2024 సాంగ్ విడుదల

జనగామ జూలై 11 (ప్రజామంటలు): కల్చరల్ క్రియేటివ్ ఛానల్ జనగామ (సిసిసి జనగామ) ఆధ్వర్యంలో యూట్యూబ్ ఛానెల్ లో లాహిరే లల్లాహిరే బోనాల పాట 2024 డిజె పూర్తి ఈనెల 12న సాంగ్ విడుదలకు సంబంధించిన పోస్టర్ గురువారం జనగామ గణేష్ వాడలోని గణేష్ టెంపుల్ వద్ద విడుదల చేశారు. జానపద కళలు, సంస్కృతి, సాంప్రదాయాలు, సామాజిక చైతన్యం, ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి సిసిసి జనగామ ఛానల్ జనగామ కేంద్రం ఇటీవల ప్రారంభించారు. సిసిసి జనగామ యూట్యూబ్ చానల్ లో సాయంత్రం 6 గంటలకు పేక్షకులకు వీక్షించడానికి అందుబాటులో ఉండే ఈ పాట రచన, గానం పాడాల రాజమ్మ, నిర్మాత అయిలా సోమనర్సింహచారి,సంగీతం సత్య సోమేష్, సాంకేతిక సహకారం చిలుమోజు సాయికిరణ్ (జెఎస్కేకే ట్యూన్స్) అందించారు. ఈపాటను, ఛానల్ ను ప్రజలు అందించాలని, సబ్స్క్రైబ్, షేర్, లైక్, కామెంట్ రాసి ప్రోత్సాహం అందించాలని నిర్వాహకులు జి. కృష్ణ కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జి. కృష్ణ, అయిలా సోమనర్సింహచారి, చిలుమోజు సాయికిరణ్, లగిశెట్టి ప్రభాకర్, పెట్లోజు సోమేశ్వరాచారి, డాక్టర్ వేముల సదానందం, పొట్టబత్తిని భాస్కర్, అంబాల శివనాద్ గౌడ్, గడ్డం మనోజ్ కుమార్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదవ రోజుకు చేరుకున్న సౌందర్యలహరి పురాణ ప్రవచనం

జగిత్యాల జులై 11 (ప్రజామంటలు): వారాహి నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని బ్రహ్మశ్రీ విషు శర్మ చే జిల్లా కేంద్రంలోని గీతా భవన్ లో జరుగుతున్న సౌందర్య లహరి ప్రవచనం ఈ రోజు 5వ కు చేరింది. అమ్మవారి సౌందర్యం గురించి చెబుతుంటే, మాటల కందని, ఊహల కందని సౌందర్యం కనుల ముందు కదలాడింది.ఈ కార్య క్రమంలో వేధ పండితులు, మాతలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని, వచ్చిన వారికి అందరికీ ప్రసాదాలు అందజేశారని సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం తెలిపారు. ఈ కార్య క్రమంలో నిర్వాహకులు గంప రజని,నార్ల రజని, పాత రాధ, తది తరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఏఎన్ఎం గా స్వరూప

భీమదేవరపల్లి జూలై 11 (ప్రజామంటలు): మండలంలోని వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, భీమదేవరపల్లి సబ్ సెంటర్లో విధులు నిర్వహిస్తున్న స్వరూప పనితీరు మెచ్చుకుంటూ, గురువారం డాక్టర్ సాంబశివరావు శాలువా కప్పి, ప్రశంసా పత్రం, మెమెంటో అందజేశారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ . తామున్న రంగాలలో నిబద్ధతతో పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందనడానికి ఇదే నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ ముతార్ రహమాన్, డాక్టర్ రుబీనా, కేఎల్ఎన్ స్వామి, వాణి, శ్యామల, స్వరూప, రాణి పాల్గొని అభినందనలు తెలియజేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలించవద్దని ధర్నా

భీమదేవరపల్లి జూలై 11 (ప్రజామంటలు): మండలంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించవద్దని తెలంగాణ అంబేద్కర్ సంఘం నాయకులు కార్యాలయం ముందు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చునూరి కరుణాకర్ మాట్లాడుతూ%ఠ%. భీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి దాదాపు 60, 70 సంవత్సరాల చరిత్ర ఉందని, గత ప్రభుత్వం హాయంలో మండల కాంప్లెక్స్ లో స్థలం కేటాయించినా, బిల్డింగ్ పిల్లర్స్ వరకే పరిమితమై పోయిందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన కార్యాలయం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో బిల్డింగ్ పూర్తి అవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ నాయకులు శాగంటి వెంకటేశ్వర్లు, ఎల్కపల్లి శ్రీనివాస్, మిడిదొడ్డి సదానందం, ఎల్కపల్లి ఆనందం, గుండేటి ప్రభాకర్, బిసి నాయకులు కొదురుపాక పోచయ్య, గూడెల్లి తిరుపతి, రాకేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భక్త మార్కండేయ సత్సంగ్ సభ్యుడు, ఆధ్యాత్మిక భక్తి పరుడు

కీ.శే. బద్రి శ్రీరాములు కుటుంబానికి ఆర్థిక సహాయం

జగిత్యాల జులై 11 (ప్రజామంటలు): జగిత్యాల పట్టణం కస్తూరి స్ట్రీట్ లో చిరువ్యాపారం చేసుకుంటూ జగదాలయములోఆధ్యాత్మిక బాటలో అన్ని సత్సంగాల్లో చురుకుగా పాలుగొంటున్న మన సత్సాంగ సభ్యులు బద్రి శ్రీరాములు గత 15 రోజుల క్రితం అనారోగ్యంతో పరమపదించారు. వారు మన మధ్య లేకపోవటం విషాదకరం. వారికి (4 గురు బిడ్డలు) ఆ కుటుంబాన్ని ఆదుకోవటానికి మన సత్సంగ్ సభ్యులు, మిత్రులు ఆర్థిక సహాయం, అందరు కలిసి దాదాపు 43,755 నలుబది మూడు వేల ఏడు వందల యాభై అయిదు రూపాయల మొత్తాన్ని ఈ రోజున అందించనైనది, ఇట్టి కార్యక్రమంలో భక్త మార్కండేయ దేవాలయం సత్సంగ్ సభ్యులు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా, శోభాయమానంగా సాగిన జగన్నాథ రథయాత్ర

ప్రారంభించిన మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

జగిత్యాల జూలై 11 (ప్రజామంటలు): పట్టణంలో ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ రథయాత్రను మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావసంత సురేష్ ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథయాత్ర పట్టణంలోని టౌన్ హాల్ నుండి ప్రారంభమై పురవీధుల గుండా శోభాయమానంగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హరే రామ, హరే కృష్ణ అంటూ భక్తి పారవశంగా పారాయణం చేశారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రథం వెళ్ళే దారిలో రహదారి మీద భక్తులు ముగ్గులు వేసి రథ యాత్ర సాగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్స్, భక్తులు, ఇస్కాన్ టెంపుల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నూతనంగా తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు ముత్తినేని వీరయ్య వర్మకు శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ వికలాంగుల మహిళా అధ్యక్షురాలు బొట్ల సుమతి, మేకల సమ్మయ్య కమిటి బృందం.అదే విదంగా రాష్ట్ర మంత్రి సీతక్క ను కలిసి వికలాంగుల సమస్యలపై వినతిపత్రం అందజేత.

హైదారాబాద్ మాసాబ్ ట్యాంక్ సంక్షేమ భవన్ లో తెలంగాణ రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జనగామ జిల్లా ఒబిసి సెల్ అధ్యక్షులు లోకుంట్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేత

ఎన్నికల హామీలను అమలు చేయాలి

జనగామ జూలై 11 (ప్రజామంటలు): నూతన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సి పి ఎస్ రద్దు, డిఎ బకాయిల చెల్లింపు, నూతన పి ఆర్ సి అమలు కోసం చర్యలు. చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రావు డిమాండ్ చేశారు. టిఎస్ యు టి ఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా జనగామ మండలంలోనివివిధ పాఠశాలలను సందర్శించి సమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుధీర్ రెడ్డి మండల అధ్యక్షులు బి. శ్రీధర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మహేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు "డ్రోన్" సేవలు అందిస్తున్న ముల్కనూర్ సహకార బ్యాంక్

ముత్తారంలో వరి పంటకు పిచికారి

భీమదేవరపల్లి జూలై 11 (ప్రజామంటలు): దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన ముల్కనూర్ కో-ఆపరేటివ్ సొసైటీ రైతులకు అందుబాటులో ఇఫ్కో కిసాన్ "డ్రోన్" సేవలను అందిస్తున్నది. వ్యవసాయములో కూలీల కొరత అధికంగా ఉండడం, సాంప్రదాయ పద్ధతులలో వ్యవసాయం చేయడం వల్ల తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. వ్యవసాయంలో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం సహాయంతో పంట ఉత్పత్తిని పెంచేందుకు కిసాన్ డ్రోన్ ప్రయోజనాలను సాధారణ చార్జీలతో రైతులకు ముల్కనూర్ సొసైటీ కల్పిస్తున్నది. ఇందులో భాగంగా మొదటిసారిగా ముత్తారంలో కాశిరెడ్డి ఆదిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో వరి పొలంలో ద్రవ వ్యవసాయ రసాయనాలను పిచికారి చేశారు. స్ప్రేయర్ తో పోలిస్తే తక్కువ సమయంలో ఎక్కువ ఎకరాలకు స్వల్ప వ్యవధిలో పిచికారి చేయవచ్చు. డ్రోన్ సహాయంతో చాలా నీటి ఆదా అవుతుంది. ఈ సందర్భంగా రైతు కాశిరెడ్డి ఆదిరెడ్డి మాట్లాడుతూ, కేవలం 15-20 ని.లలో రెండు ఎకరాలకు పిచికారి చేసినట్లు తెలిపారు. రైతులకు "డ్రోన్" సేవలను అందుబాటులో తీసుకొచ్చిన ములకనూరు సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు. డ్రోన్ ఆపరేటర్ శశి, మాదుగుల బాబు మాట్లాడుతూ%ొ%. ఇది రైతులకు చక్కటి అవకాశం అని, రైతులకు ఆర్థిక చేయూత కల్పిస్తుందన్నారు.

ఘనంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి గౌరవ శ్రీ బండి సంజయ్ జన్మదినోత్సవ వేడుకలు..

చిగురుమామిడి జూలై 11 (ప్రజామంటలు): ఇందుర్తి గ్రామంలో గురువారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బీజేపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తో కలిసి కేకు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు మురళీ మనోహర్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు పెందోట రఘునాథ చారి మాజీ మండల ప్రధాన కార్యదర్శి భీమర లక్ష్మణ్, బూత్ అధ్యక్షులు బుర్ర సత్యనారాయణ గౌడ్, ఓబీసీ మోర్చ మండల కార్యదర్శి నడిగొట్టు కిరణ్ కుమార్, కన్నం శ్రీనివాస్, శ్రీరాముల లక్ష్మణ్, చింతపూల ప్రవీణ్, పున్న%శీ% శ్రీనివాస్ కూన సతీష్, నాము సంతోష్, తాళ్ళ వంశీ కృష్ణ గౌడ్, అప్పాల ప్రశాంత్ నడిగొట్టు సాయి, గాజుల హరికృష్ణ, అవినాష్, అరవింద్, తదితర కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణపై

విద్యార్థులకు అవగాహన సదస్సు

భీమదేవరపల్లి జూలై 11 (ప్రజామంటలు): మండలంలోని ముల్కనూర్ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులకు ముల్కనూర్ పోలీస్, నార్కోటిక్ బ్యూరో వరంగల్ సంయుక్తంగా మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆచార్య రవి కుమార్, డా. ప్రహసీత్, కాజీపేట ఏసీపీ తిరుమల్, యాంటీ నార్కోటిక్ డ్రగ్ డి.ఎస్.పి సైదులు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నేటి యువత డ్రగ్ పదార్థాలకు అలవాటు పడకుండా ఉండాలని, వాటి వల్ల జరిగే పరిణామాలను విద్యార్థులకు వివరించారు. అంతేగాకుండా డ్రగ్స్ వాడడంవల్ల కలిగే మానసిక, శారీరకంగా, సమాజానికి కలిగే నష్టాలు చక్కగా వివరించారు. చుట్టు ప్రక్కల గ్రామాలలో ఎవరైనా గంజాయి త్రాగేవారు కనిపిస్తే, సమాచారం తెలిసిన వెంటనే 100 నెంబర్ లేదా నార్కోటిక్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 8712671111 కి కాల్ చేయవలసిందిగా కోరారు. అనంతరం యాంటి డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమములో కళాశాల ప్రిన్సిపాల్ కుమార్, అధ్యాపక బృందం మరియు యాంటీ నార్కోటిక్ బృందం సభ్యులు ముల్కనూర్ ఎస్సై సాయిబాబు, పోలీస్ సిబ్బంది, సుమారు 300 మంది స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీ వాయిదా ఆందోళన వెనుక కోచింగ్ సెంటర్ల మాఫియా..

బిఆరెస్ నాయకుల కుట్ర

గీకురు రవీందర్ మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్

చిగురుమామిడి జూలై 11 (ప్రజామంటలు): డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలనే ఆందోళన వెనుక కోచింగ్ సెంటర్ల యాజమాన్య మాఫియా హస్తం ఉందని కాంగ్రెస్ పార్టీ జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ తీవ్రంగా విమర్శించారు. బిఆర్ఎస్ నాయకులు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు కుట్ర పూరితమైన నిరసన కార్యక్రమాలు చేయిస్తున్నారని, కొంత మంది బిఆర్ఎస్ నాయకులు నిరుద్యోగుల ముసుగులో విద్యార్థి సంఘాల ఆందోళనలకు ఊతమిస్తున్నాం ్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల కాలములో నోటిఫికెషన్లు వేయక, ఉద్యగ ఖాళీలు భర్తీ చేయక నిరుద్యోగుల జీవితాలను నిర్వీర్యం చేసిన సంగతి మర్చిపోరాదన్నారు. గ్రూప్ 1 నోటిఫికేషన్ వేస్తె పేపర్ లీక్ అయ్యి వేలాది మంది విద్యార్థుల మనో వేదనకు కారణ మయ్యారన్నారు. గత ప్రభుత్వం ప్రకటించిన కేవలం 5,089 ఖాళీలను ముఖమంత్రి రేవంత్ రెడ్డి 11,062 పెంచి మెగా డీఎస్సీగా ప్రకటించారన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే గ్రూప్ 1, 2, 3 పరీక్షలకు నోటిఫికెషన్లతో పాటు 30వేలకు పైగా ఉద్యోగాల భర్తీ చేస్తుందన్నారు. పదేళ్ల పాటు ఒక్క ఖాళీ కూడా భర్తీ చేయని ప్రభుత్వం మీదైతే, అనతి కాలములోనే 30 వేల పోస్టులు భర్తీ చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహిస్తున్న డీఎస్సీ వాయిదా వేయమనడంలో ఆంతర్యమెంటని, కోచింగ్ సెంటర్లకు లక్షలాది రూపాయలను దోచిపెట్టడమేనా అని అన్నారు. ఉద్యోగాల భర్తీ గురించి, నిరుద్యోగ యువత ఉపాధి గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. కనుమరుగవుతున్న పార్టీ ఉనికి కోసం ప్రాచుర్యం కోసం నిరుద్యోగ యువకుల భావోద్వేగాలతో ఆడుకోవడం సరికాదన్నారు. నిరుద్యోగుల పట్ల బిఆర్ఎస్ నాయకుల కపట ప్రేమను తెలంగాణ సమాజం నిషితంగా గమనిస్తుందన్నారు.

ఎస్సైని కలిసిన బంజారా నాయకులు

రాయికల్ జులై 11 (ప్రజామంటలు): రాయికల్ నూతన ఎస్సై టి అశోక్ ను మర్యాదపూర్వకంగా కలిసి సాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన మండల బంజారా నాయకులు ఈ కార్యక్రమంలో లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు మాలవత్ సురేందర్ నాయక్ ఏఐబిఎస్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బానోత్ తిరుపతి నాయక్ లంబాడీల ఐక్యవేదిక రాయికల్ మండలాధ్యక్షులు బానోతు రమేష్ నాయక్, బానోత్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన శాంతిభద్రతలు

కుప్పకూలుతున్న రియల్ రంగం

పాతకశీర్షికల్లో వార్తలు వస్తున్నా లేని చలనం

రేవంత్ ప్రభుత్వంపై కెటిఆర్ ఆగ్రహం

హైదరాబాద్, (ప్రజా మంటలు):
ఈ మహానగరానికి ఏమైంది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. రియల్ రంగం కుప్పకూలిపోతుండగా, శాంతిభద్రతలు అదుపు తప్పాయని అన్నారు. ప్రముఖ పత్రికలు కూడా ఈ నగరానికి ఏమైందని ప్రముఖంగా వార్తలు రాస్తున్నా యంటే నగరంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని అర్థమని వివరించారు. పరిపాలనా అనుభవం లేని నాయకత్వం ఎలా ఉంటుందో హైదరాబాద్ నుంచి తెలంగాణ పల్లెటూరు వరకూ అంతటా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 'బ్రాండ్ హైదరాబాద్' ఎందుకు మసకబారుతోంది . విశ్వనగరంగా ఎదుగుతున్న వేళ.. ఎందుకింత కళ కోల్పోతోందని సగటు హైదరాబాదీకి అనిపిస్తుందని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ ను ప్రేమించే ప్రతిఒక్కరిలో ఇదే ఆవేదన ఉందని తెలిపారు. పదేళ్లు ప్రశాంతంగా ఉన్న నగరంలో వరుస హత్యలు.. అంతరాష్ట్ర ముఠాలు పెరిగిపోతున్నాయని,పేట్రేగిపోతున్న అన్నారు. రాజధాని హైదరాబాద్‌లో శాంతి లేదని.. నగర ప్రజల జీవితాలకు భద్రత లేదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం గారు స్వయంగా పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ కు వస్తున్నా.. పోలీసింగ్‌పై కమాండ్ ఏది అని ప్రశ్నించారు. క్షీణిస్తున్న శాంతిభద్రతలపై కంట్రోల్ ఏది అని నిలదీశారు. ఓవైపు.. కుప్పకూలిన రియల్ ఎస్టేట్ రంగం.. పరిపాలనా వైఫల్యాన్ని వేలెత్తి చూపుతోందని తెలిపారు. మరోవైపు.. పడగవిప్పిన హత్యల సంస్కృతి.. ప్రతి కుటుంబంలో వణుకు పుట్టిస్తోందన్నారు. ఇంకోవైపు.. తరలిపోతున్న పెట్టుబడుల పర్వం.. యువత ఉపాధి అవకాశాల్ని దెబ్బతీస్తోందని చెప్పారు. కాంగ్రెస్ పవర్ లోకి రాగానే గడియ గడియకు ఏమిటీ.. పవర్ కట్ అని కేటీఆర్ ప్రశ్నించారు. సేఫ్ సిటీగా ఉన్న మహానగరంలో క్రైమ్ రేట్ ఎందుకు పెరిగిపోతుందని

నిలదీశారు. ఇదేనా మీరు తెస్తానన్న మార్పు అని మండిపడ్డారు. విశ్వనగరంగా తీర్చిదిద్దడానికి.. పదేళ్లు కష్టపడి పునాదులు వేస్తే.. అధికారంలోకి రాగానే ఆగం చేస్తే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచంతో పోటీపడే నగరంగా ఎదుగుతున్న హైదరాబాద్ ప్రగతికి అర్ధాంతరంగా బ్రేకులు వేస్తే ఎలా ?? దేశ రాజధాని చుట్టూ.. రాజకీయ చక్కర్లు కొట్టడంపై ఉన్న శ్రద్ధ.. చిక్కుల్లో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్ర రాజధానిపై లేకపోతే ఎలా ?? అని మండిపడ్డారు. హైదరాబాద్ అంటే.. కేవలం రాజధాని కాదు..తెలంగాణ ఎకనమిక్ ఇంజన్ అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇకనైనా.. కాంగ్రెస్ సర్కారు మేల్కొనకపోతే.. మన హైదరాబాద్ దెబ్బతింటే.. యావత్ దేశానికి కూడా నష్టమని కెటిఆర్ తెలిపారు.

అటవీ సంపదను పునరుద్ధరించుకోవాలి

ప్రతి ఒక్కరూ కనీసం 20 మొక్కలు నాటాలి

అప్పుడే లక్ష్యం చేరుకోగలం

నిజామాబాద్,జూలై11(ప్రజా మంటలు):
రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం ప్రకారం పచ్చదనాన్ని 33 శాతానికి చేరాలంటే జిల్లాలో ప్రతి ఒక్కరూ 20 మొక్కలు నాటాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. కేవలం ప్రభుత్వం ద్వారానే ఇది విజయవంతం కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని అటవీ అధికారులు అన్నారు. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా చాలా చోట్ల అడవి తగ్గిపోయింది. పచ్చదనం కాస్తా కనుమరుగై మైదానాలను తలపిస్తోంది. కామారెడ్డి జిల్లా అంటే ఒకప్పుడు సువిశాల అటవీ ప్రాంతం ఇప్పుడు కాస్తా అడవి హరించుకుపోవడంతో వర్షాలు లేక ఏటా అక్కడక్క డ అల్ప వర్షాపాతం సైతం నమోదు అవుతోంది. అటవీ సంపదను పునరుద్ధరించి ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి ప్రభుత్వాలు మొక్కలు నాటే కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. ఏటా లక్షలాది మొక్కలను నాటుతూ పల్లెల్లో పచ్చదనం వెల్లివిరిసే లా చూస్తోంది. ఈసారి వర్షాలు అంచనాలకు తగ్గట్లుగా కురిస్తే నాటిన మొక్క ల్లో 70నుంచి 80శాతం మొక్కలు బతికే వీలుంది. ఈసారి భారీగా మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని ప్రభుత్వం భారీగా చేపట్టింది. గ్రామాలు, పట్టణాల్లో చైతన్యవంతులైన ప్రజలు మొక్కలు నాటే కార్యక్ర మంలో భాగస్వాములైతే సంకల్పం నెరవేరినట్లేనని అధి కారులు భావిస్తున్నారు. టేకు మొక్కలతో పాటు వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు, యూకలిప్టస్, కానుగ, వేప, జామా యిల్ తదితర రకాల మొక్కలు కొద్ది రోజుల్లోనే నాటేందుకు సిద్ధం కానున్నాయి. మొక్కలు నాటడంలో కొన్ని శాఖలు విఫలం అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈసారి మా త్రం అలాంటివి పునరావృతం కాకుండా పటిష్టవంతమైన చర్యలు తీసుకుంటున్నారు. నాటిన మొక్కలను బతికించు కునేందుకు ప్రభుత్వం ఈసారి ప్రత్యేకంగా దృష్టి సారించింది. వానలు సంవృద్ధిగా కురిసే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో నాటిన మొక్కలకు జీవం పోసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి.

గ్రామాల్లో పచ్చదనం వెల్లివిరియాలి

వనమహోత్సవంలో అంతా పాల్గొనాలి

కామారెడ్డి,జూలై11 (ప్రజా మంటలు):
వాతావరణంలో అసమానతలు తొలగించేందుకు పర్యా వరణాన్ని రక్షించడంలో మొక్కలు పెంపకం తప్పనిసరి అని కాంగ్రెస్ నేత, మాజీమంత్రి షబ్బీర్ అలీ తెలిపారు. పర్యా వరన హితం కోసం మొక్కలు నాటడడంలో ప్రతి ఒక్కరూ మమేకం కావాలని అన్నారు. ఇది లాభాపేక్ష లేని కార్యక్రమం గా చూడాలన్నారు. వర్షాలు సకాలంలో రావాలన్నా ప్రజలంతా మొక్కల పెపంపకంలో భాగస్వాములు కావాలన్నారు. అధికారులు,ప్రజాప్రతినిధులు ఏదైనా గ్రామాన్ని దత్తతగా భావించి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని అన్నారు. వ్యాపార దృక్పథంతో చూడకుండా సమాజానికి ఏదైనా పది కాలాల పాటు మేలు కలిగేలా ఉండే ఇలాంటి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని భావితరాలకు పచ్చదనం, ఆరోగ్యకర సమాజాన్ని అందించాలని అన్నారు. నేషనల్ హైవే అథారిటీ వారికి అటవీ శాఖ వారు మొక్కలు నాటడం చేపడుతారని తెలిపారు. 56 కి.మీ పొడవున్న నేషనల్ హైవే వెంబడి మొక్కలు పెద్ద ఎత్తున నాటడం జరుగుతుందని తెలిపారు. ఇకపోతే ప్రతీ గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారని అన్నారు. ప్రతీ గ్రామంలో ఈజీఎస్ అధికారులతో నర్సరీలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతీ గ్రామంలో స్థలాలను ఎంపిక చేస్తున్నామన్నారు.

రుణంపైనే ఆధారపడ్డ రైతన్నల సేద్యం

సకాలంలో రునాలు అందక తంటాలు

కరీంనగర్, జూలై11 (ప్రజా మంటలు):
పంటరుణాల పంపిణీలో జగిత్యాల జిల్లాలో కనీసం 50శాతం మంది రైతులకు కూడా చేరడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మరోవైపు పంటరుణ పరిమితి అమలు లేకపోగా నిబంధనల ప్రకారం పంటరుణం తీసుకునే ప్రతిరైతుకు కిసాన్‌క్రెడిట్ కార్డును ఇవ్వాలి. రైతు ఖాతాలో బ్యాంకర్లు రుణం నిధులను జమచేసిన తరువాత రైతు వాడుకున్న మొత్తానికే వడ్డీ చెల్లించాలి. రైతుకు ఒకేసారి నిధులు అవసరం ఉండవు. పంట సాగునుంచి చివరి వరకు దఫాలుగా నిధులు అవసరం ఉంటాయి కాబట్టి ఖాతాలో నుంచి కార్డుద్వారా అవసరం ఉన్నపుడు తీసుకుని తిరిగి ఖాతాలో జమచేసే వీలుండాలి. దీనివల్ల రైతులకు ఎప్పుడూ నిధులు అందుబాటులో ఉంటాయి, వడ్డీ తగ్గుతుంది. పంటకాలంలోనైనా తమకు పంటరుణాలు దక్కుతాయని అన్నదాతలు ఆశలు పెంచుకున్నారు. జిల్లాలో సన్న, చిన్నకారు రైతులే అధికంగా ఉండగా వీరికి ప్రభుత్వం అందించే పంటరుణాలే ఆధారం కానున్నాయి. గతకొన్ని సీజన్లుగా పంటరుణాల పంపిణీ లక్ష్యానికి దూరంగానే నిలిచిపోతుండగా కౌలు రైతులకు సైతం పంటరుణాల పంపిణీ దరిచేరడం లేదు. రైతులకు ఒకేసారి రుణమొత్తాన్ని చెల్లించి ఒకేసారి వసూలు చేస్తున్నారు. మరోవైపు పంటరుణ పరిమితి ఒక్కో పంటకు ఒక్కో రకంగా ఉంటున్నా ఈ పరిమితి మేరకు ఇవ్వడం లేదు. జిల్లాలో జాతీయ, గ్రామీణ, సహకార బ్యాంకులుండగా వీటిద్వారా రైతులకు రుణాలను అందిస్తున్నారు. కొన్ని బ్యాంకుల్లో పంటరుణాల మంజూరు, రెన్యూవల్స్ రైతులకు తలకుమించిన భారంగా మారుతోంది. మరోవైపు జిల్లాలో కౌలురైతు లుంటారు కాబట్టి వీరిరికూడా వచ్చే వానాకాలం పంట రుణాన్ని దరిచేర్చేలా చర్యలుండాలి. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసినపుడే రైతులకు పంటరుణాల పంపిణీ లక్ష్యం నెరవేరుతుంది. రైతులకు పంట రుణంతో పాటుగా స్వల్ప, ధీర్ఘకాలిక, భూమి అభివృద్ధి, బావుల తవ్వకం, మోటార్లు, పైపులైన్లకు కూడా రుణాలను మంజూరివ్వాల్సి ఉంటుంది.

అటవీభూముల్లో మొక్కల పెంపకం

వనమహోత్సవానికి జిల్లా అటవీశాఖ సన్నద్ధం

ఆదిలాబాద్, జూలై11 (ప్రజా మంటలు):
ఈ ఏడాది జిల్లాలో హరితహారం కింద అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కల ను పెంచేందుకు ప్రణాళికలు తయారు చేశారు. వనమహోత్సవంలో భాగంగా అటవీ ప్రాంతాల్లోని పలుచగా ఉన్న చోట, ఇతర ప్రాంతాల్లో లక్ష మొక్కలను నాటేందుకు అటవీశాఖ అధికారుల చర్యలు తీసుకుంటు న్నారు. జిల్లా వ్యాప్తంగా వర్షాలు ఇప్పుడిప్పుడే అడపాదడపా కురుస్తోండడంతో అధికారులు మొక్కలు నాటేందుకు సిద్ధమయ్యారు. ఈ విడతలో వివిధ శాఖల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలను నాటాలని అధికారులు నిర్ణయించారు. అటవీశాఖ,డీఆర్‌డీవో ఆధ్వర్యంలో మొక్కలను నాటాలని లక్ష్యంగా ఎంచుకోగా పలు ప్రభుత్వ శాఖలకు సైతం లక్ష్యాలని నిర్దేశించారు. ఇందుకు అవసరమైన మొక్కలను వివిధ శాఖల ఆధ్వర్యంలో నర్సరీల్లో సిద్ధం చేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో నర్సరీల్లో వివిధ రకాల మొక్కల పెంపకాన్ని చేపట్టడానికి డీఆర్‌డీవో,మున్సిపల్, ఐటీడీఏ ఆధ్వర్యంలో సైతం వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. ఈ విడతలో మొక్కలు నాటాల్సిన ప్రాంతాలను ముందుగానే గుర్తించిన అధికారులు ఏయే ప్రాంతాల్లో ఎలాంటి మొక్కలు నాటాలనే వాటిని గుర్తించి వాటిని నర్సరీల్లో సిద్ధం చేశారు. ప్రజలు ఇండ్లలో పెంచుకు నేందుకు అవసరమైన మొక్కలను సైతం నర్సరీల్లో పెంచారు. ప్రజలకు అవసరమైన మొక్కలను ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసేందుకు సైతం చర్యలు తీసుకుంటున్నట్లు

అధికారులు తెలిపారు. గ్రామాల్లోని వివిధ ప్రాంతాల్లో టేకు, సీతాఫల్, మలబార్, వేప, కల్పేతర మొక్కలు, ప్రతి ఇంటికి వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు నాటేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వీటితో పాటు ఆదిలాబాద్ మున్సిపాలిటీ, వ్యవసాయశాఖచే రైతులు భూముల్లో, ఎక్సైజ్ శాఖ, పంచాయతీ శాఖ,పోలీస్ శాఖ నీటిపారుదల శాఖల ఆధ్వర్యంలోమొక్కలు నాటేందుకు ప్రణాళికల సిద్ధం చేశారు. ఇతర ప్రభుత్వశాఖలైన పౌరసరఫరాలు, బీసీ సంక్షేమం, విద్యాశాఖ, మార్కెటింగ్, ఎస్సీ కార్పొరేషన్, దేవాదాయ శాఖ, మైనార్టీ, ఆర్టీ సీ, విద్యుత్, పరిశ్రమలు, పశు సంవర్ధక, మహిళా శిశు సంక్షేమం, వైద్య శాఖ ఆధ్వర్యంలో మొక్కలను నాటేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

ప్రేమ వివాహం కాదన్నందుకు అక్కసు దంపతులను దారుణంగా హత్య చేసిన దుండగుడు

నిందితుడి కోసం పోలీసులు ముమ్మర గాలింపు

వరంగల్, జూలై11 (ప్రజా మంటలు):
వరంగల్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ప్రేమ వివాహాన్ని కాదన్నందుకు ఓ యువకుడు ఉన్మాదిగా మారి యువతి తల్లిదండ్రులను హతమార్చాడు. ఈ ఘటన చెన్నారావుపేట మండలం పదహారు చింతల తండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బానోతు శ్రీనివాస్(45), బానోతు సుగుణ (40) దంపతులు పదహారు చింతల తండాలో నివాసముంటున్నారు. వారి కుమార్తె దీపికను గుండెంగ గ్రామానికి చెందిన బన్నీ అనే యువకుడు గత నవంబర్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారు. జనవరిలో యువతి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆ యువతిని తల్లిదండ్రులతో పంపించారు. అప్పటి నుంచి యువతి ఇంటి వద్దే ఉంటూ హనుమకొండలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారనే సమాచారంతో బన్నీ ఉన్మాదిగా మారాడు. గురువారం తెల్లవారుజామున పదునైన ఆయుధంతో ఇంటి ముందు నిద్రిస్తున్న శ్రీనివాస్, సుగుణ దంపతులపై దాడికి పాల్పడ్డాడు. సుగుణ అక్కడి కక్కడే మృతిచెందగా.. శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు నర్సంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు. ఈ ఘటనలో దీపిక, ఆమె సోదరుడు మదన్‌లాల్ కూడా గాయపడ్డారు. వారిని మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, నెక్కొండ సీఐ చంద్రమోహన్ పర్యవేక్షణలో చెన్నారావు, గూడూరు, నెక్కొండ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని గ్రామంలో బందోబస్తు నిర్వహించారు. ఇదిలావుంటే నర్సంపేట ప్రభుత్వ హాస్పిటల్ దగ్గర ఉద్రిక్తత నెలకొంది. హత్యకు గురైన వారి శవాలకు నర్సంపేట ప్రభుత్వ హాస్పిటల్లో పోస్ట్ మార్టం కోసం తీసుకుని వచ్చారు. దీంతో మార్చురీ దగ్గరకు బంధువులు భారీగా చేరుకున్నారు. అవాంఛీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీగా మోహరించారు. బాధితులకు న్యాయం చేయాలంటూ మార్చురీ దగ్గర బంధువులు ఆందోళన దిగారు. మార్చురీ దగ్గర మృతుల బంధువుల ఆర్తనాథాలు మిన్నంటాయి. మరోవైపు డబుల్ మర్డర్ కేసులో పోలీసులు విచారణ కొనసాగుతోంది. ఉన్మాది దాడిలో గాయపడిన దీపిక, ఆమె సోదరుడికి చికిత్స అందిస్తున్నారు. నిందితుడు నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అదే ఊరులో ఉన్న నాగరాజు స్నేహితులు హత్యకు సహకరించాడని బాధితుల బంధువులు వారిపై దాడికి యత్నించారు. పరారైన నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. పోలీసులు కేసు విచారణను వేగవంతం చేశారు.

పన్ను వసూళ్లలో నెరవేరని లక్ష్యం

బకాయిలు రాబట్టడంలో కష్టాలు

హైదరాబాద్, (ప్రజా మంటలు):
పన్నులపై వడ్డీలమీద వడ్డీల భారం పడడంతో, ఇంటిపన్నుల వసూళ్లు మందగించాయి. గ్రామాలు, పట్టణాల్లో ఇంటిపన్ను వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. పట్టణాలు విస్తరించడం,కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పడ్డా ప్రజల ఆదాయవనరులు పెరగడం లేదు. దీంతో పట్టణాల్లో వ్యాపారాలు చితికి పోతున్నాయి. పురపాలికలు రోజు రోజుకు విస్తరిస్తుండగా, ఆ మేరకు ఆదాయం రావడం లేదు. పట్టణం అభివృద్ధి చెందడంతో పాటు ఓవైపు మాల్స్, వ్యాపార సముదాయాలు, మరోవైపు ఇళ్ల నిర్మాణాలు పెరుగుతున్నాయి. కానీ ఆ స్థాయిలో ఆదాయం మాత్రం పెరగడం లేదని అంటున్నారు. మున్సిపాలిటీల పరిధిలోని దుకాణాల విషయంలో కొందరు అద్దె చెల్లిస్తుండగా, మరికొందరు పెండింగ్‌లో పెట్టడంతో మునిసిపల్ ఆదాయం దెబ్బతింటోంది. లీజుకు తీసుకున్న వారు పెద్ద మొత్తంలో సబ్ లీజుకు దుకాణాలను ఇచ్చుకుంటున్నారు. దీనివల్ల కూడా రావలసిన ఆదాయం రాకుండా పోతోంది. మునిసిపాలి టీకి పన్నుల వసూలు కూడా అంతంత మాత్రంగానే ఉంది. పన్ను వసూళ్ళలో నిర్లక్ష్యం వహించడం వంటి కారణాల వల్ల మునిసిపాలిటీకి రావాల్సిన మేర ఆదాయం రావడం లేదని తెలుస్తోంది. మాల్స్, వ్యాపార సముదాయాలు, ఇళ్ల నిర్మాణాలు విస్తరిస్తుండటంతో పట్టణం రోజురోజుకు పెరుగుతోంది. అయితే ఆ స్థాయిలో ఆదాయం మాత్రం రావడం లేదు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు సమకూర్చా లంటే పన్నుల రూపంలో ప్రజలు ఆదాయం చెల్లించాల్సి ఉంది. అధికార యంత్రాంగం నిర్లిప్తత, కింది స్థాయి ఉద్యోగుల ఉదాసీనత కారణంగా సరైన అస్సెస్‌మెంట్ చేయకపోవడం వల్లే పట్టణం పరిగినంత వేగంగా ఆదాయం పెరగడం లేదని తెలుస్తోంది.

సానుకూల దృక్పథంతో సాగాలి !

తిరుమల, జూలై11 (ప్రజా మంటలు):మనిషి ఎంతగా పాజిటివ్ థింకింగ్ చేస్తే..మన శరీంరంలోని అవయవాలు అంతగా అనుకూలంగా ప్రతిస్పందిస్తాయి. లేకంటే వ్యతిరేక దిశలో పనిచేస్తాయి. ఇది అనుభవంతో పాటు, ఆచరణలో తెలుసుకున్న విషయాలు. మన శరీరంలోకి వెళ్లిన గాలి మరు నిముషంలోగా బయటికి వెళ్లిపోవాలి లేకపోతే కార్బన్‌డయాక్సైడ్‌గా మారి మనం రోగగ్రస్థులం అవుతాం. మరి మనలోకి చేరిన కోపం, అసూయ, ద్వేషం, మోసం... ఇలాంటివన్నీ కూడా మన ఆరోగ్యాన్ని దెబ్బతీసే శతృవులు. సంవత్సరాలుగా ఇవి మనలోనే ఉంటే... మనం శరీరం మందులకు లొంగని వ్యాధిగా తయారవుతుంది. మన శరీరంలోకి అధిక మొత్తంలో ప్రాణశక్తిని చేర్చే ఏకైక మార్గం ధ్యానం, యోగాయే... అందుకే భారతీయ ఋషులు ధ్యానం, యోగ మార్గాన్నే అనుసరించారు.రోజూ కనీసం అర గంట... ధ్యానం, యోగ చెయ్యండి... ఆరోగ్యంగా జీవించండని తెలిపారు. అలాగే నెగెటివ్ థాట్స్‌కు దూరంగా ఉండాలి. అలా ఉంటేనే మన అవయవాలు సరిగా పనిచేస్తాయి. లేకుంటే వాటిపై ప్రభావం పడి అవి పనిచేయకుండా చచ్చుపడతాయి. మన శరీరంలోకి వెళ్లిన ఆహారం 24 గంటల్లో... మలినంగా బయటికి వెళ్లిపోవాలి. లేకపోతే ఆ మలినాలు జబ్బులకు కారణం అవుతాయి. .మన శరీరం లోకి వెళ్లిన నీరు 4 గంటల్లో బయటికి వెళ్లిపోవాలి, లేకపోతే జబ్బులు తప్పవు. 'మనం రోజూ జీవిస్తున్నాం అని అనుకుంటాం...కానీ మనం రోజూ కొద్దికొద్దీగా మరణిస్తున్నాం. మనకు వయసు పెరిగితే... ఆయుష్షు తగ్గినట్టా? పెరిగినట్టా?... మనం ప్రతి రోజూ... నెగెటివ్ ఎనర్జీ లతో కొద్ది కొద్దిగా మరణిస్తున్నామన్న చేదు నిజాన్ని త్వరగా గ్రహించాలి. మనలో చేరి బయటికి వెళ్లిపోకుండా తిష్ట వేసుకొని... మన జీవితాల్ని మృతప్రాయం చేస్తున్న కోపాన్ని, ఒత్తిడిని, ద్వేషాన్ని, బద్ధకాన్ని, అనారోగ్యాన్ని ప్రతిరోజూ ధ్యానం, యోగ చెయ్యడం ద్వారా ప్రాణశక్తిని ఎక్కువగా పొంది నెగెటివ్ ఎనర్జీ దూరం చెయ్యాలి. అప్పుడే స్వస్థత చేకూరుతుంది.

భద్రాద్రి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

మంత్రి తుమ్మల దృష్టి సారించాలంటున్న స్థానికులు

భద్రాద్రి, జూలై11 (ప్రజా మంటలు):
యాదాద్రి తరహాలోనే భద్రాద్రిని కూడా అద్భుత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దే సంకల్పానికి ముహూర్తం కుదరడం లేదు. మరోవైపు పోలవరంతో భద్రాద్రికి ముప్పు అన్న ఆందోళన వస్తోంది. ఈ రెడు విషయాలపై ఎలాంటి స్పందనా కానరావడం లేదు. మరోవైపు భద్రాద్రి రక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. భద్రాచలం ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్‌ప్లాన్ రూపకల్పన పై గతంలో మంత్రి తుమ్మల తదితరులతో చర్చించారు. పలుసూచనలు చేశారు. ఆలయ అధికారులు, దేవస్థానం పండితులు, స్తపతులతో కలిసి భద్రాద్రి అభివృద్ధి మాస్టర్ ప్లాన్ గురించి చర్చించారు. కానీ అవన్నీ పక్కకుపోయాయి. తుమ్మల రాజకీయంగా మళ్లీ తెరపైకి వచ్చారు. ఈ క్రమంలో ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని స్థానికులు కోరుతున్నారు. యాదాద్రిలాగా కాకాపోయిన కొంతయినా చేసి భద్రాద్రిని పునర్నించాలని కోరుతున్నారు. భద్రాద్రి ఆలయాన్ని జాతీయస్థాయిలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలన్నదే తెలంగాణ ప్రభుత్వ సంకల్పంగా ఉందని నాటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఇక్కడ ఏటా శ్రీరామ నవమి, సీతారామ చంద్రస్వామి కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. అయినా ఆలయ అభివృద్ధి ప్రణాళిక మాత్రం ముందుకు సాగడం లేదు. ఆలయ అభివృద్ధిని చేపట్టి భద్రాద్రినిపర్యాటకకేంద్రంగా తీర్చి దిద్దాలని స్థానికులుకోరుతున్నారు.

నదీజలాల సద్వినియోగంపై చర్చించాలి !

పరస్పర అవగాహనతో ముందుకు సాగాలి - సముద్రంలోకి వృధాగా పోకుండా చూడాలి

అమరావతి/హైదరాబాద్,జూలై11 (ప్రజా మంటలు): ఇరు రాష్ట్రాల మధ్య నదీజలాల విషయంలో స్పష్టమైన అవగాహనకు రావాల్సి ఉంది. నదీజలాలు ఏటా సముద్రంలో కలుస్తున్నాయి. వాటిని సద్వినయోగం చేసుకునేందుకు ఉమ్మడిగా ప్రాజెక్టుకులను నిర్మించుకోవడం, నిర్వహించుకోవడం అవసరం.అలాగే వాన నీటిని ఒడిసి పట్టుకోవడంలో ఇరు ప్రభుత్వాలు శ్రద్ధ చూపాలి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వాననీటిని వృధాగా పోకుండా ఉమ్మడిగా ప్రణాళికలు సిద్ధంచేయాలి. ఇటీవల కృష్ణా,గోదవారి బోర్డుల్లో పరస్పర ఫిర్యాదులతో నీటి పంచాయితీలను కొనసాగిం చారు. ఇది వాంఛనీయం కాదు. జగన్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడ్డ తొలినాళ్లలో నీటి వాటాలను సహేతుకంగా పంచుకుంటామని, కలసి పోతామని ప్రకటించారు. కానీ ఆ స్ఫూర్తి ఎక్కడా కానరాలేదు. ఇటీవల మరోమారు తెలుగు రాష్ట్రాల సిఎంలు కూర్చుని విభజన సమస్యలను ప్రస్తావించారు. పరస్పర అవగాహనతో ముందుకు పోతామని ప్రకటించారు. అదే సందర్భంలో జలవనరుల విసయంలో పరస్పర అవగాహన అవసరం. సున్నితమైన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సుహృద్భావం ఉండాలే తప్ప రెచ్చగొట్టే విధానాలు సరికాదు. ఉభయ ప్రభుత్వాలు వీలున్నంత త్వరగా సామరస్యంగా జల వివాదాలను పరిష్కరించుకుని ఇటు రాయలసీమ అటు తెలంగాణలోని కరువు ప్రాంతాలకు నీటిని తరలించే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలి. ఘర్షణల వల్ల నష్టపోయేది రెండు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలే అని గమనించాలి.కేంద్రం కూడా బోర్డులు ఏర్పాటు చేసినా ఫలితం కానరావడం లేదు. సమస్యలను పెద్దవిగా చేయకుండా పరిష్కరించే మార్గాలను చూపుతూ శాశ్వతంగా సమస్యలకు చెక్ పెట్టగలగాలి. ఆల్మట్టి,నారాయణపూర్ ప్రాజెక్టుల కారణంగా కృష్ణా నది కిందనున్న ప్రాజెక్టులకు ఇప్పటికే నీరు సక్రమంగా అందడం లేదు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కర్ణాటక, మహారాష్ట్రలకు కేటాయించిన అదనపు జలాలను వారు వినియోగించుకుంటే ఉభయ తెలుగు రాష్ట్రాలకు మిగులు జలాలు కాదుకదా బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నికర జలాలకు కూడా గ్యారంటీ ఉండదు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కృష్ణాజలాల్లో తమ వాటాగా ఉన్న నికరజలాలకు గ్యారంటీని పొందడంతో పాటు బచావత్ ట్రిబ్యునల్ చెప్పిన పద్ధతిలో మిగులు జలాలను వినియోగించుకునే హక్కును తెలుగు రాష్ట్రాలు కాపాడుకోవాలి. ఇందుకోసం ముందుగా ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య పరస్పర విశ్వాసం, అవగాహన ఉండాలి. ఇరు రాష్ట్రాలు ఉమ్మడిగా కేంద్ర పెత్తనాన్ని ఎదుర్కోవలసి ఉంది. ఎవరివాటాలను వారు వాడుకునే విధంగా నడుచుకోవాలి. వివాదాన్ని కేంద్రమే పరిష్కరించాలని కోరడమనేది శతృవుకు జుట్టు ఇచ్చినట్లు అవుతుంది. నీటి సమస్యలు

భావోద్వేగాలను తీవ్రతరం చేయడం సరికాదు. అనేక సమస్యలను పరిష్కరించ లేని కేంద్రం ఇక జల వివాదాలను సరిదిద్దుతుందన్న నమ్మకం లేదు. అందువల్ల ఉన్న ఒప్పందాల మేరకు నడుచుకునే విధంగా తెలుగు రాష్ట్రాల సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు కూర్చుని మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. ఇందులో ప్రదానంగా గోదావరి, కృష్ణాల నుంచి వృధాగా సముద్రంలో కలుస్తున్న నీటిని వినియోగించడంపై నిపుణులతో చర్చించాలి. విభజనకు ముందువరకు కలసి వున్న మనం ఇప్పుడు జగడాలు పడడం తగనిపనిగా పాలకలు,రాజకీయ పార్టీలు,నేతలు గుర్తించాలి. సమస్యలను ఎగదోసే రాజకీయ పార్టీల నేతల తీరును ఎండగట్టాలి. పొరుగు రాష్ట్రాలతో గొడవలు వద్దనుకుంటున్న ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు ఈ విషయంలో హుందాగానే ఉంటున్నందున సమిష్టిగా సమస్యలను పంచుకోవాలి. తెలంగాణ మంత్రులు కూడా సంయమనంతో సమస్యలను చర్చించాలి. ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో మన బంధాలు బలపడాలి. ప్రభుత్వాలు తమ వాటా నికర జలాలకు కట్టుబడి ఉంటూ, మిగులు జలాలను ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప భావోద్వేగాలు రెచ్చ గొట్టడం వాంఛనీయం కాదు. నిజానికి కృష్ణా,గోదావరి చివరి బేసిన్‌లో ఉన్నవి తెలుగు రాష్ట్రాలే. ఈ రెండు రాష్ట్రాలు ఈ నీటిని ఎలా ఉపయోగించుకోవాల అన్నది నిర్ణయించుకోవాలి. దీనిద్వారా ఇరు రాష్ట్రాల రైతాంగం బాగుపడుద్ది. సముద్రంలోకి నీరు వృధాగా పోకుండా ఉమ్మడిగా ప్రాజెక్టులను నిర్మించకునే అవకాశాలను పరిశీలించాలి. పోతిరెడ్డిపాడు నుంచి కిందకు పూర్తిస్థాయిలో నీరు రావాలంటే శ్రీశైలంలో 881 అడుగులు నీళ్లు ఉండాలి. శ్రీశైలంలో పూర్తి నీటి మట్టం 885 అడుగుల నీళ్లు ఉన్న రోజులు గత 20 ఏళ్లలో ఏడాదిలో 20 నుంచి 25 రోజులు కూడా లేవు. ఇలాంటి సమయంలో పోతిరెడ్డిపాడుకు పూర్తి స్థాయిలో నీటిని తీసుకెళ్లలేని పరిస్థితి. మరోవైపు పాలమూరు రంగారెడ్డి, డిండి ప్రాజెక్టు, కల్వకుర్తి సామర్థ్యం పెంచి 800 అడుగులలోపే నీటిని తీసుకునే వెసులుబాటు తెలంగాణకు ఉందంటున్నారు. 796 అడుగుల వద్దే తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. 800 అడుగుల్లోపు లోనే మీకు కేటాయించిన నీటిని వాడుకుంటే తప్పులేనప్పుడు.. 881 అడుగులు ఉంటే తప్ప నీళ్లు వాడుకోలేని పరిస్థితి మాకున్నప్పుడు.. మేం 800 అడుగుల వద్దే మాకు కేటాయించిన నీటిని తీసుకోవడంలో తప్పేముందని ఎపి అధికారులు ప్రశ్నిస్తున్నారు. నిజానికి ఈ విషయాలపై స్పష్టత రావాలి. అలాగే రాజకీయంగా మరిన్ని చర్చలు చేయాలి. ఈ క్రమంలో నదీ జలాల పంపిణీ, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణ విషయమై రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మరింత లోతుగా చర్చలు సాగాలి. నిజానికి సమస్య ఎక్కడుందో ఆలోచించాలి. ప్రజలకు తాగునీరు, సాగు అవసరాలు, జల విద్యుత్తు, పారిశ్రామిక అవసరాలు... ఇలా నీటి వినియోగ ప్రాధాన్యతలు అంతర్జాతీయ సూత్రాలకు అనుగుణంగా నిర్ణయించబడి ఉన్నాయి. ఆయా నియమాలను పాటిస్తూ, ఏవైనా ప్రత్యేక పరిస్థితులు ఏర్పడితే సర్దుబాటు చేసుకొని పరస్పరంగీకారంతో ఉమ్మడి ప్రాజెక్టులను నిర్వహించుకోవాలి. అప్పుడు కృష్ణా, గోదావరుల్లో మనకు ఉన్నంత నీరును సద్వినియోగం చేసుకోవచ్చు.

వర్షాలతో సీజనల్ వ్యాధుల భయం

జిల్లాల్లో మలేరియా,డెంగ్యూల ప్రభావం

వైద్యారోగ్యశాఖ హెచ్చరికలు బేఖాతరు

శ్రీకాకుళం,జూలై11 (ప్రజా మంటలు): యేటా వానా కాలంలో వ్యాధుల ముప్పు పెరిగి పేదల జీవితాలు దుర్భరమవుతున్నాయి. మలేరియా, డెంగ్యూ, చికున్‌గు న్యా, మెదడువాపు, ఫైలేలేరియా, అతిసారం, టైఫాయిడ్, తదితర సీజనల్ వ్యాధులు గ్రామీణులను తీవ్రంగా వేధిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశమున్నందున పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖ ఏటా హెచ్చరిస్తూనే ఉంది. ఇందుకు సంబంధించి ఇటీవల ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులతో పాటు, కరోనా నియంత్రణ చర్యలను కూడా ఏకకాలంలో కొనసాగించాలని వైద్య ఆరోగ్యశాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటిసంబదిత, కీటక సంబందిత వ్యాధులు ప్రబలుతున్నందున్న జాగ్రత్తగా ఉండాలనిఆయా శాఖలను ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న సామాజిక, బౌగోళిక వైరుధ్యాల కారణంగా యేటా వానాకాలంలో అంటు వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు కూడా ప్రబలడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. మలేరియా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ గుర్తించింది. సమస్యాత్మక ప్రాంతాల జాబితాలో..ఈ నేపథ్యంలోనియంత్రణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. మలేరియా, డెంగ్యూ జ్వరాలతో బాదితులు మరణించినట్లు అధికారికంగా రికార్డు కాకపోయినా ఏజెన్సీలో ఎలాంటి డయాగ్నసిస్ చేయని కేసులే అధికంగా ఉన్నాయంటున్నారు. కాగా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించామని చెబుతున్నా మారుమూల గ్రామాల్లో రహదారులు సరిగ్గా లేని కారణంగా సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి శాంపిల్స్‌ను సేకరించే పరిస్థితులు అంతంత మాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో చాలా మంది జ్వరాల బారిన పడిన రోగులు అందుబాలులో ఉండే ఆర్ఎంపీలు, సాంప్రదాయ నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తూ ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఏజెన్సీలో మలేరియా వంటి వ్యాధుల నియంత్రణ కోసం ఆదివాసీ గ్రామాల్లో వేల దోమ తెరలను పంపిణీ చేశారు. మారుమూల అటవీ గ్రామాల్లో ప్రతి సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అత్యంత సమస్యాత్మక ప్రాంతాలకు సిబ్బంది కనీసం కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలంలో వాగులు, వంకలు దాటుకుంటూ అక్కడి చేరుకోవడం వైద్య సిబ్బందికి కత్తిమీద సాములా మారింది.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఆందోళన వద్దు

- ప్రధాని ఆశీస్సులతో వందశాతం వృద్ధి సాధిస్తాం
- దేశ ఆర్థికాభివృద్ధిలో స్టీల్‌ప్లాంట్ కీలక భూమిక
- కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి వెల్లడి
- ప్రైవేటీకరణ జరగరాదన్నదే ప్రజల అభిమతమన్న ఎమ్మెల్యే

విశాఖపట్టణం,జూలై11 (ప్రజా మంటలు): విశాఖ స్టీల్ ప్లాంట్ దేశ ఆర్థికాభివృద్ధికి సహాయ పడుతోందని కేంద్ర పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి అన్నారు. విశాఖ పర్యటనకు వచ్చిన ఆయన.. గురువారం స్టీల్ ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై అనేక మంది ఆధారపడి ఉన్నారన్నారు. దీన్ని రక్షించడం తమ బాధ్యత అని తెలిపారు. ప్లాంట్ మూతపడుతుందనే ఆందోళన వద్దన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో వంద శాతం సామర్థ్యంతో ఉత్పత్తి జరుగుతుందని కుమారస్వామి తెలిపారు. అంతకు ముందు విశాఖ ఉక్కు పరిశ్రమలోని వివిధ విభాగాలను కేంద్రమంత్రి పరిశీలించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించడం తమ బాధ్యత అని, ప్లాంట్ మూతపడు తుందనే ఆందోళన వద్దని మంత్రి కుమారస్వామి అన్నారు. ఉక్కు ఉత్పత్తి సహా అన్ని విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాల వివరాలను కేంద్ర మంత్రికి అధికారులు వివరించారు. ప్లాంట్ సందర్శన అనంతరం కుమార స్వామి మీడియాతో మాట్లాడారు. 'విశాఖ స్టీల్ ప్లాంట్ దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. ఉక్కు పరిశ్రమపై అనేక మంది ఆధారపడి ఉన్నారు. ప్రజలు, సిబ్బంది ఎలాంటి ఆందోళనలు చెందొద్దు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో పరిశ్రమలో వంద శాతం సామర్థ్యంతో ఉత్పత్తి జరుగుతుందని కుమార స్వామి స్పష్టం చేశారు. ఇదిలావుంటే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటైజేషన్ అవ్వకూడదనే భావన అందరికీ ఉందని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమార స్వామిని

కలిసేందుకు స్టీల్ ఎలాంట్ అడ్మిన్ బ్లాక్‌కు ఎమ్మెల్యే వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... స్టీల్ ప్లాంట్ ఉద్యోగాలకు భద్రత కల్పించి ఎంతో మంది ప్రాణత్యోగాలు చేసి స్టీల్ ప్లాంట్‌ను తీసుకొచ్చారని గుర్తుచేశారు. విశాఖ నుంచి ఆంధ్రప్రదేశ్ బీజేపీ తరఫున ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటైజేషన్ అవ్వకుండా మంచి భవిష్యత్తు స్టీల్ ప్లాంట్‌కి ఉండేటట్టు చూడవలసిందిగా తాము కూడా కోరామని తెలిపారు. ఎలక్షన్ ముందు కూడా కోరడం జరిగిందన్నారు. ఎలక్షన్ తర్వాత బీజేపీ పార్లమెంట్ సభ్యులు... కేంద్ర అధిష్టానానికి చెప్పామన్నారు. కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్, కేంద్రమంత్రి కుమారస్వామి ప్లాంట్ విజిట్ చేసి మంచి నిర్ణయం తీసుకుంటారని నమ్మకం ఉందన్నారు. స్టీల్ ప్లాంట్‌కు అనేక రకాల ఆప్షన్స్ ఉన్నాయన్నారు. ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటే.. మన భవిష్యత్తు బాగుంటుంది, ఉద్యోగస్తులకు ఇబ్బంది లేకుండా ఉండాలనేది అందరి అభిప్రాయం' అని విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు.

దేవుడిని టచ్ చేశారు...ఫలితం అనుభవించారు

ఎర్రదొంగలను వదిలేది లేదన్న బండి

తిరుమలలో ఇక భక్తులదే రాజ్యం

తిరుమల, జూలై11 (ప్రజా మంటలు): శ్రీవారి ఆస్తులకు పంగనామాలు పెట్టిన నయవంచ కులు పోయారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇప్పుడు స్వామివారికి నిత్యం సేవ చేసే రాజ్యం వచ్చిందని చెప్పారు. గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. తన పుట్టినరోజు సందర్భంగా బండి సంజయ్ శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వాగతం పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ నేపథ్యంలో వైసీపీపై సంచలన వ్యాఖ్యలు చేశారు బండి. తిరుమలలో శ్రీవారి ఆస్తులకు పంగనామాలు పెట్టిన నయ వంచకులు దిగిపోయారని అన్నారు. ఎర్రచందనం పేరుతో జాతీయ సంపదను పూర్తిగా కొల్లగొట్టారని మండిపడ్డారు. స్వామివారిని టచ్ చేశారు కాబట్టే ఘోరంగా ఓడిపోయారని అన్నారు. దేవుడి ఆస్తులను దోచుకొని తింటే ఎవ్వరికైనా ఇలాంటి గతే పడుతుందని అన్నారు. జగన్ హయాంలో టీటీడీ రాజకీయ నిరుద్యోగులకు పునరావాస కేంద్రంగా మారిందని బండి ఫైర్ అయ్యారు. ఎర్రచదనం దొంగలను వదిలిపెట్టే ప్రసక్తే



లేదని అన్నారు. నయవంచ కులు పోయి, స్వామి వారికి నిత్యం సేవ చేసే సేవకులు వచ్చారని అన్నారు. ఏపీలో గత వైకాపా ప్రభుత్వ పాలకులు వీరప్పన్ వారసులని అబివర్ణించారు. ఎర్రచందనం పేరుతో జాతీయ సంపదను దోచుకున్నారు. ఆ డబ్బుతో రాజకీయాలను శాసించే స్థాయికి చేరుకున్నారు. ఎర్రచందనం దొంగలను వదిలిపెట్టేదే లేదని ఈ సందర్భంగా కేంద్రమంత్రి హెచ్చరించారు. గత అరాచక ప్రభుత్వంలో స్వామివారి నిధులను పక్కదారి పట్టించి తిరుమలను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారు. శేషాచలం కొండల్లో ఎర్రచందనం దోపిడీపై నివేదిక కోరతాం. దాని ఆధారంగా జాతీయ సంపదను దోచుకున్న వారిపై చర్యలు తీసుకుంటాం అని వెల్లడించారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై గతంలోనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, తిరుపతి భాజపా నాయకులు అనేక పోరాటాలు చేశారు. కొండ మీద అరాచక పాలన ముగిసింది. ఇన్నాళ్లు భక్తులు ఎదుర్కొన్న సమస్యలు తొలగి పరిస్థితులు చక్కబడ్డాయి. స్వామివారి ఆస్తుల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటాం. నరేంద్ర మోదీ దేశాన్ని విశ్వగురువుగా చేసేందుకు కృషి చేస్తున్నారు. ఆయన సారథ్యంలో భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతోందని బండి సంజయ్ అన్నారు.

రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కృషి

ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతున్నా

ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఎపి సిఎం చంద్రబాబు

అమరావతి, జూలై11 (ప్రజా మంటలు): ఏపీ పునర్నిర్మాణం కోసం ఓ లక్ష్యంతో పని చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈమేరకు ఆయన ఎక్స్(ట్విటర్) వేదికగా పోస్టు చేశారు. గత ప్రభుత్వం నిర్వాకాలు ఇప్పుడు పెద్ద సవాల్‌గా మారాయి. రాష్ట్ర పునర్నిర్మాణ మిషన్‌లో అందరి మద్దతు అవసరం. పౌరులకు సమాచారం అందించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. బుధవారం జరిపిన బీపీసీఎల్, విన్‌సాఫ్ట్ సమావేశాల కారణంగా ఉపాధి కల్పనకు బీజం పడనుంది. పెద్దఎత్తున

పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుంది. గత ఐదేళ్ల విధ్వంసంలో పెట్టుబడిదారులు విశ్వాసం కోల్పోయారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఇది ప్రభావం చూపింది. ఇప్పుడు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పొందడం చాలా కీలకం. పెట్టుబడిదారులకు మన రాష్ట్రం సురక్షితమైన గమ్యస్థానమని భోరోసా ఇవ్వాలి. దేశంలోనే నంబర్ 1 రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కలసికట్టుగా కృషి చేస్తాం' అని చంద్రబాబు తెలిపారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TEL-TEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com